


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు] అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నెగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 156 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-




### పురిటి నొప్పులు కన్నా..

# ప్రైవేట్ 'కోతలే' మహాప్రమాదం!



- లక్షల బిల్లులతో నిలువు దోపిడీ..
- సిజేరియన్ల దందాపై అధికారుల మౌనం దేనికి సంకేతం?
- నార్మల్ డెలివరీ మృగ్యమేనా?
- భయపెట్టి.. జేబులు ఖాళీ చేస్తున్న 'వైద్య మాఫియా'
- గాలికి డబ్ల్యూహెచ్‌వో నిబంధనలు..
- చోద్యం చూస్తున్న యంత్రాంగం
- పురిటి నొప్పుల కంటే.. బిల్లుల భయమే ఎక్కువ..
- అప్పుల ఊబిలో సామాన్యుడు!

**కాకినాడ, విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి :**
నవమాసాలు మోసి, పేగుతెంచుకుని బిడ్డకు జన్మనివ్వడం ఒక తల్లికి మధురానుభూతి. కానీ, నేడు ఆ అనుభవం సామాన్యుడి పాలిట 'ఆర్థిక ఉరితాడు'గా మారుతోంది. "నార్మల్ డెలివరీ చేయండి డాక్టర్.. ఆ పురిటి నొప్పిని నేను భరిస్తాను" అని నిండు గర్భిణీలు వేడుకుంటున్నా, డాక్టర్ల చేతులు మాత్రం కత్తిపీట వైపే వెళ్తున్నాయి. సహజ సిద్ధంగా జరగాల్సిన ప్రసవం కాస్తా ఇప్పుడు కృత్రిమంగా, శస్త్రచికిత్సగా మారిపోయింది. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలు అనేవి అరుదైన విషయాలుగా మారిపోయాయి. లాభాల కక్కుర్తితో 'కోతలు' కోస్తూ సామాన్యుడిని అప్పుల పాలు చేస్తున్న ఈ సిజేరియన్ల దందాపై 'విశ్వం వాయిస్' ప్రత్యేక కథనం.

**భయమే వారి పెట్టుబడి.. కత్తిపీటే పరిష్కారం!**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భిణీ అడుగుపెట్టిన దగ్గరి నుంచి 'నార్మల్ డెలివరీ' అనే మాటే వినిపించడం లేదు. డాక్టర్లు గర్భిణీ కుటుంబ సభ్యుల భయాన్ని తమ పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. తొమ్మిది నెలల పాటు "అంతా నార్మల్.. తల్లీ బిడ్డా క్షేమం" అని నమ్మించే వైద్యులు, తీరా కాన్పు సమయానికి అసలు రంగు మిగతా .. 2లో..

## అధికారులారా.. మీ నిఘా ఏది? మీ బాధ్యత ఏది?

(ప్రభుత్వం తక్షణమే తీసుకోవాల్సిన చర్యలు)

రాష్ట్రంలో మాతా శిశు మరణాలను తగ్గించడానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం వల్లే ఈ దోపిడీ నిరాటంకంగా కొనసాగుతోంది. దీనిపై తక్షణమే ఉక్కుపాదం మోపాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య శాఖపై ఉంది.

**కఠినమైన క్లినికల్ ఆడిట్:** ప్రతి ప్రైవేట్ ఆసుపత్రిలో జరిగే ఆపరేషన్లపై నిష్పాక్షికమైన ఆడిటింగ్ జరగాలి. ఏ కారణంతో ఆపరేషన్ చేశారు? నార్మల్ డెలివరీకి చేసిన ప్రయత్నాలేంటి? అన్నది రికార్డుల్లోనే కాకుండా, క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి.

**టాస్క్ ఫోర్స్ ఏర్పాటు:** ఆసుపత్రుల బిల్లింగ్ మరియు అనవసరపు మిగతా .. 2లో..

### మండలిలో సోము వీర్రాజుపై దాడికి

## వైకాపా సభ్యుల యత్నం




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ శాసన మండలిలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు పైకి వైకాపా సభ్యులు ఇజ్రాయెల్, విక్రాంత్, రమేశ్ యాదవ్ దూసుకెళ్లారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం పూర్తయిన తర్వాత చర్చకు వైకాపా సభ్యులు పట్టుబట్టారు. మంత్రి సమాధానం పూర్తవడంతో తర్వాత ప్రశ్నకు మండలి ఛైర్మన్ అవకాశం కల్పించారు. దీంతో ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఆయన పైకి ఎమ్మెల్సీ ఇజ్రాయెల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన కొందరు సభ్యులు దూసుకెళ్లారు. తాము నిరసన మిగతా .. 2లో..

# బాధితులకు వైద్య సాయం, బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం

○ శ్రీకాకుళంలో డయేరియా, రాజమండ్రిలో కల్తీ పాల అంశంపై ముఖ్యమంత్రి సమీక్ష ○ ఘటన జరిగాక స్పందించడం కాదు...ముందస్తు పర్యవేక్షణ అవసరం ○ జిల్లా కలెక్టర్లు, అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి.... ప్రజల్లో ఉంటేనే సమస్యలు తెలుస్తాయి ○ వైద్యారోగ్యపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం పట్టణంలో నీటి కలుషితం కారణంగా ప్రబలిన డయేరియా, రాజమండ్రిలో కల్తీ పాల కారణంగా పలువురు చనిపోయిన ఘటనలపై సీఎం చంద్రబాబు సమీక్ష చేశారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో జరిగిన ఈ సమీక్షలో మున్సిపల్, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. రెండు ఘటనల్లో బాధితులకు అందుతున్న వైద్య సాయంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైన ఘటనల్లో బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం సీఎం ఆదేశించారు. రెండు ఘటనలకు దారి తీసిన పరిస్థితులపై కారణాలను విశ్లేషించాలని సూచించారు. ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఘటన జరిగాక స్పందించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని, ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తత ద్వారా ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల్లోని జిల్లా స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడితే నివారించవచ్చని సీఎం అన్నారు. ప్రతి ప్రభుత్వ విభాగంలో కింది స్థాయి యంత్రాంగాన్ని యాక్టివేట్ చేసేందుకు, ఆయా విభాగాల్లో పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రతి అధికారి క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ఒక్కో సందర్భంలో ఒక్కో శాఖపై ఆకస్మిక తనిఖీకి వెళ్లడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. కిందిస్థాయి అధికారులతో పాటు...సంబంధిత శాఖల్లో జవాబుదారీ తనం పెరుగుతుందని...అప్పుడు ఇలాంటి ఘటనలు నివారించవచ్చని సీఎం స్పష్టం చేశారు. కలెక్టర్లు అంటే నిత్యం ప్రజల్లో ఉండాలని...అప్పుడే అనుకున్న మార్పు రాష్ట్ర స్థాయిలో చూపించగలమని సీఎం పేర్కొన్నారు. శ్రీకాకుళంలో తాగునీరు కలుషితం అయిన ఘటనలో ముందస్తు పర్యవేక్షణ, తనిఖీలు జరిగి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని సీఎం అభిప్రాయపడ్డారు.

**జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులు వివరించిన కలెక్టర్లు**

సీఎంతో సమీక్ష సందర్భంగా శ్రీకాకుళం జిల్లా, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, వైద్య ఆరోగ్య శాఖ, మునిసిపల్ శాఖ అధికారులు రెండు ఘటనల్లోని ప్రస్తుత పరిస్థితులను వివరించారు. డయేరియా ఘటనపై శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 'ఇప్పటి వరకూ 129 డయేరియా కేసులు నమోదు అయ్యాయి. ప్రస్తుతం మిగతా .. 2లో..

### కార్నీ భారత్ పర్యటన వేళ..

## స్వరం మార్చిన కెనడా



**విశ్వం వాయిస్ న్యూస్ :** జస్టిన్ ట్రూడో హయాంలో ఒడుదొడుకులకు గురైన భారత్–కెనడా సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి. ప్రస్తుత ప్రధాని మార్క్ కార్నీ భారత్‌తో స్నేహానికి మొగ్గు చూపుతున్నారు. ఆయన మన దేశ పర్యటనకు రానున్నారు. ఇలాంటి సమయంలో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. మన ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను కెనడా అధికారులు వెనక్కి తీసుకున్నారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?**

రెండేళ్ల క్రితం.. కెనడా ఎన్నికల్లో విదేశీ శక్తులు జోక్యం చేసుకున్నాయంటూ అక్కడి విపక్షాలు ఆరోపించాయి. దాంతో అప్పటి ట్రూడో ప్రభుత్వం మిగతా .. 2లో..

## వాయుసేన విన్యాసాలు..

'ప్రచండ్'లో ప్రయాణించనున్న రాష్ట్రపతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజస్థాన్‌లో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జైసల్మేర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ 'ప్రచండ్'లో గగన విహారం చేయనున్నారు. అనంతరం భారత్– పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని పోఖ్రాన్‌లో వైమానిక దళం ఆధ్వర్యంలో 'వాయు శక్తి' పేరిట నిర్వహించనున్న విన్యాసాలను వీక్షించనున్నారు. ఎల్‌సీహెచ్ 'ప్రచండ్' అనేది స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి యుద్ధ హెలికాప్టర్. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ దీన్ని తయారుచేసింది. 2022 అక్టోబరులో వాయుసేనలోకి మిగతా .. 2లో..

### చేనేత అభివృద్ధికి

## ప్రభుత్వం కట్టుబడి ఉంది

రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నేతన్నలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు చేనేత ఉత్పత్తుల విక్రయాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, స్టాళ్లు ఏర్పాటు చేస్తోందన్నారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను మంత్రి కొలుసు పార్థసారథి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ జిల్లాల నుంచి వచ్చిన చేనేత ఉత్పత్తులను, వాటి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల స్పందనతో అమ్మకాల గురించి ఆరా తీశారు. నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయబోతున్నామన్నారు. చేనేత సహకార సంఘాలకు విడతలవారీగా బకాయిలు సైతం విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మిగతా .. 2లో..

### సీఎం అనుమతితో

## త్వరలోనే విద్యుత్ శాఖలో నియామకాలు

- ఆర్టీఎస్ఎస్ పనులతో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా
- సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ లకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ
- తుపానులను తట్టుకునేలా విశాఖలో అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థ

-ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యుత్ శాఖలో సిబ్బంది కొరతను భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుమతితో త్వరలోనే నియామక ప్రక్రియ చేపడతామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గురువారం నాడు మండలిలో సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, కావలి గ్రీష్మ, బీటీ నాయుడు అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి సమాధానం చెప్పారు. క్షేత్ర స్థాయిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సిబ్బంది అవసరం ఉందని మంత్రి తెలిపారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా, రీస్టోరేషన్ పనుల కోసం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వంటి వివిధ పద్ధతుల ద్వారా నియామకమైన 18,000 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. రెగ్యులర్ మెయింటినెన్స్, విద్యుత్ అంతరాయాలు తగ్గించడంతో పాటు ఓల్టేజ్ స్టెబిలిటీని పెంచడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. వినియోగదారులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించే లక్ష్యంతో విద్యుత్ శాఖ ముందుకు మిగతా .. 2లో..

### రాయలసీమకు

## నిజమైన ద్రోహి జగనే

మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఏపీ శాసనమండలిలో అధికార తెదేపా, ప్రతిపక్ష వైకాపా సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ దద్దరిల్లింది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ఆపిందని.. ఆ ప్రాంతానికి సీఎం చంద్రబాబు అన్యాయం చేశారని వైకాపా సభ్యులు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వంతో లాలూచీ పడి ప్రాజెక్టును నిలిపివేశారని ఆ పార్టీ సభ్యులు ఇషాక్ బాషా, రామసుబ్బారెడ్డి ఆరోపించారు.

**అధికారంలో ఉన్నప్పుడు వైకాపా పట్టించుకోలేదు**

వైకాపా ఆరోపణలను మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ తిప్పికొట్టారు. జగన్ సీఎంగా ఉండగానే ఆ ప్రాజెక్టును ఎన్జీటీ ఆపిందని.. జరిమానా కూడా విధించిందని నిమ్మల గుర్తుచేశారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ప్రాజెక్టు గురించి కనీసం పట్టించుకోలేదన్నారు. రాయలసీమ ప్రాంతానికి నిజమైన ద్రోహి జగన్ అని.. ఆయన్ను నిలదీయకుండా తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వైకాపా హయాంలోనే సీమలోని ప్రాజెక్టులన్నీ తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### పురిటి నొప్పుల కన్నా..

# ప్రైవేట్ 'కోతలే' మహా ప్రమాదం!

బయటపెడతారు. "ఉమ్మనీరు బాగా తగ్గిపోయింది, బిడ్డ మెడకు పేగు చుట్టుకుంది, తల్లికి బీపీ పెరిగింది, వెంటనే ఆపరేషన్ చేయకపోతే తల్లీబిడ్డల ప్రాణాలకే ప్రమాదం" అంటూ వైద్య పరిభాషలు వాడి క్షణాల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారు. ఆ కంగారులో ఏ భర్త అయినా, ఏ కుటుంబమైనా "డబ్బులు పోయినా పర్వాలేదు, నా భార్యాబిడ్డలు క్షేమంగా ఉంటే చాలు" అని సిజేరియన్‌కు అంగీకరించి సంతకాలు చేస్తున్నారు.

**సమయం ఆదా.. కాసుల వాన**

నిజానికి సహజ ప్రసవం కోసం డాక్టర్లు, సిబ్బంది కనీసం 12 నుంచి 24 గంటల పాటు గర్భిణీ పక్కన కూర్చుని పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ నేటి కార్పొరేట్ ఆసుపత్రులకు అంత ఓపిక లేదు. ఆపరేషన్ అయితే అరగంటలో ముగించేయవచ్చు. సమయం ఆదాతో పాటు, బిల్లు ఎక్కువేస్తే ఆసుపత్రికి భారీ లాభం వస్తుందన్న ఏకైక దురుద్దేశంతోనే కత్తికి పదును పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులే 'ముహూర్తాల పిచ్చి'తో ఫలానా సమయానికే ఆపరేషన్ చేయమని అడగడం కూడా ఈ ప్రైవేట్ ఆసుపత్రులకు వరంగా మారుతోంది.

**నడ్డి విరుస్తున్న దాచిన ఖర్చులు**

సాధారణ ప్రసవానికి మహా అయితే పది నుంచి ఇరవై వేల రూపాయల ఖర్చు అవుతుంది. అదే సిజేరియన్ అయితే ఆసుపత్రి స్థాయిని బట్టి రూ. 60 వేల నుంచి లక్షన్నర రూపాయల పైనే వసూలు చేస్తున్నారు. కేవలం ఆపరేషన్ ఫీజు మాత్రమే కాకుండా.. ఐసీయూ చార్జీలు, అనస్థీషియా డాక్టర్ ఫీజు, ఎక్విప్‌మెంట్ చార్జీలు.. ఇలా పొడవైన బిల్లును చేతిలో పెడుతున్నారు. ఒక సామాన్యుడు తన బిడ్డను చూసుకునే ఆనందం కంటే ముందు, ఆసుపత్రి బిల్లులు కట్టడానికి పడే మానసిక క్షోభ వర్ణనాతీతం. వడ్డీ వ్యాపారుల కాళ్లు పట్టుకుని అప్పులు తెచ్చి మరీ బిల్లులు కడుతున్నారు.

**తల్లీబిడ్డల ఆరోగ్యానికి తీరని ముప్పు!**

ఈ ఆపరేషన్ల వల్ల జరిగే నష్టం కేవలం జేబులకు మాత్రమే కాదు. ఒక తండ్రికి ఆర్థిక భారం అయితే, తల్లికి అది దీర్ఘకాలిక శారీరక శిక్ష. సిజేరియన్ వల్ల కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది. భవిష్యత్తులో తీవ్రమైన వెన్నునొప్పి, రక్తస్రావం, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు, ఆపరేషన్ కారణంగా తల్లికి వెంటనే పాలు పడకపోవడం, శిశువు పాలు తాగడానికి తీవ్ర ఇబ్బందులు పడటం జరుగుతోంది. దీనిని ఆసరాగా చేసుకుని కృత్రిమ పౌడర్ డబ్బాలకు, పాలు తీసే 'మెషిన్ల'కు తల్లీబిడ్డలను బానిసలుగా చేస్తున్నారు. డెలివరీ తర్వాత బిడ్డకు ఇన్ఫెక్షన్ సోకిందంటూ (నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) లో పెట్టి రోజుకు వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తున్న ఆసుపత్రుల సంఖ్య లెక్కలేనన్ని.

**గణాంకాలు చెబుతున్న భయంకర నిజాలు**

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం మొత్తం ప్రసవాల్లో 10 నుంచి 15 శాతం మాత్రమే సిజేరియన్లు జరగాలి. కానీ తాజా గణాంకాల (చీఖీనూ-5) ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో సిజేరియన్ల రేటు దాదాపు 56.12% కి చేరుకుంది! ప్రైవేట్ ఆసుపత్రుల్లో అయితే ఇది 67% నుండి 90% వరకు ఉంటోంది. ఇంత బహిరంగంగా డబ్ల్యూహెచ్‌వో నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ప్రశ్నించే నాథుడే లేడు.

## అధికారులారా.. మీ నిఘా ఏది? మీ బాధ్యత ఏది?

సిజేరియన్లను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక 'టాస్క్ ఫోర్స్' కమిటీలను నియమించాలి. ఆకస్మిక దాడులు నిర్వహించాలి.

సెకండ్ ఒపీనియన్ తప్పనిసరి: ప్రైవేట్ డాక్టర్లు ఆపరేషన్ సూచించినప్పుడు, దానికి ప్రభుత్వ డాక్టర్ల ధ్రువీకరణ తప్పనిసరి చేస్తూ నిబంధనలు తీసుకురావాలి.

మిడ్‌వైఫ్ వ్యవస్థ బలోపేతం: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ సహజ ప్రసవాలను ప్రోత్సహించేలా సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేయాలి.

వైద్యం అనేది సేవగా ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. అధికారులు వెంటనే మేల్కొని కఠిన చర్యలు తీసుకోకపోతే.. రేపటి రోజున పేదవాడు వైద్యం కోసం ఇల్లు, వాకిలి అమ్ముకోవాల్సిన దుస్థితి వస్తుంది. తల్లీబిడ్డల ప్రాణాలతో, సామాన్యుల ఆస్తులతో చెలగాటమాడుతున్న ఈ పగటి దోపిడీకి తక్షణమే చరమగీతం పాడాలి!

## వైకాపా సభ్యుల యత్నం

తెలుపుతుంటే మైక్ ఎందుకు తీసుకున్నారంటూ వీర్రాజుపై దాడికి యత్నించారు. సోము వీర్రాజుకు మద్దతుగా మంత్రులు అనిత, గొట్టిపాటి రవికుమార్ వెళ్లి అడ్డుకున్నారు. ఉద్రిక్త వాతావరణం మధ్య సభను మండలి ఛైర్మన్ మోషేనురాజు కాసేపు వాయిదా వేశారు.

## వాయుసేన విన్యాసాలు..

ప్రవేశపెట్టారు. ఎడారుల నుంచి పర్వతాల వరకు విభిన్న ప్రాంతాల్లో దీన్ని నడపొచ్చు. 5,000 మీటర్ల పైన ఎత్తులోనూ ఎగరగలదు. ముఖ్యంగా పర్వత ప్రాంత సరిహద్దుల వెంట మోహరింపునకు ఇది అనుకూలంగా ఉంటుంది. అధునాతన ఏవియానిక్స్, స్టెల్త్ ఫీచర్లు, రాత్రి వేళల్లోనూ దాడులు చేయగల సామర్థ్యం దీని సొంతం. క్షిపణులు, రాకెట్లు, 20 ఎంఎం గన్ వంటి ఆయుధాలను ప్రయోగించవచ్చు. రాష్ట్రపతి ముర్ము 2023 ఏప్రిల్‌లో అస్సాంలోని తేజ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానంలో ప్రయాణించారు. గతేడాది అక్టోబరులో అంబాలాలో రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. వాయుసేనకు చెందిన రెండు వేర్వేరు యుద్ధ విమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా ముర్ము నిలిచారు. గతేడాది డిసెంబరులో కర్ణాటకలోని కార్వార్ తీరంలో కల్వరి శ్రేణి జలాంతర్గామి 'ఐఎన్ఎస్ వాఘ్‌షీర్'లో ప్రయాణించారు.

## స్వరం మార్చిన కెనడా

ఒక స్వతంత్ర కమిషన్ ఏర్పాటుచేసింది. ఆ క్రమంలో జరిగిన దర్యాప్తులో భారత్ పేరును చేరుస్తూ కెనడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో రెండు దేశాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. అయితే ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. ఇతర దేశాల ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడం భారత్ విధానం కాదని తేల్చి చెప్పింది. అది జరిగిన కొన్ని రోజులకే ట్రూడో ఎత్తులకు షాక్ తగిలింది. కెనడా రాజకీయాల్లో భారత్ ఎలాంటి జోక్యం చేసుకోలేదని దర్యాప్తులో తేటతెల్లమైంది. 2021 నాటి ఎన్నికలను ప్రభావితం చేసేలా న్యూదిల్లీ ప్రయత్నాలు చేసినట్లు తమ దృష్టికి రాలేదని కెనడాలో ఎన్నికలను పర్యవేక్షించిన ఓ సీనియర్ అధికారి కమిషన్‌కు వెల్లడించారు. ఇప్పుడు ఆ ఎన్నికల జోక్యం అంశం పైనే కార్నీ ప్రభుత్వం స్పందించింది. తమ దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భారత్ జోక్యాన్ని తాము విశ్వసించడం లేదని కెనడా అధికారి వెల్లడించారు. అదే విశ్వసిస్తే తమ ప్రధాని భారత పర్యటనకు వెళ్లే అవకాశమే లేదన్నారు. "ఈ అంశాలపై మేం భారత ప్రభుత్వంతో సమగ్ర చర్చలు జరిపాం. విదేశీ జోక్యాన్ని నివారించేలా మా వద్ద మెరుగైన భద్రతా చర్యలు ఉన్నాయి" అని సదరు అధికారి మీడియాతో మాట్లాడారు.

### చేనేత అభివృద్ధికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

కట్టుబడి ఉందని, రాష్ట్రంలో నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నారని మంత్ర కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు.

### సీఎం అనుమతితో

# త్వరలోనే విద్యుత్ శాఖలో నియామకాలు

వెళ్తుందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్న 5,580 మంది సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ లకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ద్వారా సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ లకు శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించేకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ లు విద్యుత్ శాఖకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే 77 శాతం పైగా ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారు. అదే విధంగా ఏఈఈల నియామక ప్రక్రియ కూడా త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. లైన్ మెన్ ల నియామకం పైనా ప్రభుత్వం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని మంత్రి సభ్యులకు వివరించారు. అదే విధంగా క్షేత్ర స్థాయి విద్యుత్ అవసరాలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అందుబాటులో ఉన్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించుకుంటున్నామన్నారు.

**రూ.8 వేల కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు**

వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయం విద్యుత్ సరఫరా చేయడం కోసం రూ.8 వేల కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు చేపట్టినట్లు మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ఫీడర్ లెవల్ బైఫర్కేషన్ ద్వారా అగ్రికల్చర్ ఫీడర్లను వేరు చేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా గ్రామాల్లో ఎటువంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని, వచ్చే ఏప్రిల్ నాటికి 100 శాతం పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా విశాఖపట్నం వంటి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నష్టం కలుగకుండా అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి ప్రకటించారు. తుపానులు, వరదలు వచ్చినప్పుడు విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రాంతాలు, డిస్కంలతో సంబంధం లేకుండా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాలు వరద ప్రభావానికి గురైనప్పుడు ఉద్యోగులందరూ రాత్రి, పగలూ కష్టపడి 24 గంటల్లోనే ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ పనురుద్ధరణ చేపట్టినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు.

### రాయలసీమకు

# నిజమైన ద్రోహి జగనే

విమర్శించారు. ఆ ప్రాంతానికి నీరిచ్చేందుకు ఒక్క ప్రాజెక్టునూ జగన్ చేపట్టలేదన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం సాగునీటి కోసం కాదు.. తాగునీటి కోసమని వైకాపా ప్రభుత్వం 2023 ఆగస్ట్ 18న జీవో నంబర్ 364 సహా అఫిడవిట్ ఇచ్చిన విషయాన్ని నిమ్మల సభ దృష్టికి తీసుకొచ్చారు.

అప్పుడు హరీశ్‌రావు ఏం చెప్పారో తెలుసుకోండి..

మంత్రి సమాధానంపై మండలి ప్రతిపక్ష నేత బొత్స సహా వైకాపా సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై ఎక్కడా సమాధానం ఇవ్వలేదంటూ నిరసన తెలిపారు. దీంతో సభను మండలి ఛైర్మన్ కాసేపు వాయిదా వేశారు. అనంతరం మళ్లీ సభ ప్రారంభయ్యాక గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుపై ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే రేవంత్ వ్యాఖ్యలపై మంత్రి సమాధానానికి వైకాపా సభ్యులు పట్టుబట్టారు. ఈక్రమంలో బొత్స సత్యనారాయణ, మంత్రుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 2020లో ఎన్జీటీకి వెళ్లి రాయలసీమ ఎత్తిపోతలను తామే ఆపామని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారని మంత్రి నిమ్మల అన్నారు. అప్పటి సీఎం జగన్‌తో తెలంగాణ సీఎం కేసీఆర్ మాట్లాడటంతో ప్రాజెక్టు ఆగిందని హరీశ్‌రావు స్పష్టం చేసిన విషయాన్ని తెలుసుకోవాలన్నారు. మంత్రి సమాధానంపై బొత్స అసంతృప్తి వ్యక్తంచేయగా.. మంత్రి పయ్యావుల ఘాటుగా స్పందించారు. రాయలసీమ లిఫ్ట్ విషయంలో తప్పంతా వైకాపా ప్రభుత్వానిదేనని చెప్పారు. ఆ ప్రాజెక్టును ఆపి తప్పు చేసిందెవరో ఆ పార్టీ సభ్యులు తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను వైకాపా ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. సభలో గందరగోళం చెలరేగడంతో మండలి ఛైర్మన్ సభను కాసేపు వాయిదా వేశారు.

### బాధితులకు వైద్య సాయం, బాధ్యులపై

# కఠిన చర్యలకు ఆదేశం

107 మందికి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నాం. ఆరోగ్యం మెరుగువ్వటంతో 20 మందిని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. డయేరియా పరిస్థితిని ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పైపుల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాను నిలుపుదల చేసి ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నాం. నాలుగు ఇంజనీరింగ్ బృందాలు వివిధ ప్రాంతాల్లో 40 లీకులను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. 150 మంది సిబ్బంది, 7 జేసీబీలు, 2 బాబ్ కాట్ యంత్రాలు, 10 టాక్టర్ల సాయంతో పారిశుధ్య నిర్వహణ చేపట్టాం. ఇవాళ రాత్రిలోగా విశాఖ నుంచి మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌ను శ్రీకాకుళానికి తరలిస్తున్నాం. ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నాం. పారామెడిక్స్‌ను అందుబాటులో ఉంచాం. రిమ్స్, కిమ్స్, శ్రీకాకుళం జెమ్స్‌లో ప్రత్యేక వార్డుల ద్వారా డయేరియా రోగులకు చికిత్స అందిస్తున్నాం. నెఫ్రాలజీ నిపుణులు, ఇతర వైద్య నిపుణులను కూడా ఈ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. డయేరియా వ్యాప్తికి కారణం ఏమిటన్న దానిపై విచారణ చేస్తున్నాం. డోర్ టూ డోర్ సర్వే చేసి శానిటేషన్ కిట్‌ను అందజేస్తున్నాం. స్థానికులు వాటర్ ట్యాంకులు క్లీన్ చేయకపోవడం, పైప్ లైన్ల డ్రైన్లు క్రాస్ అవ్వడంతో పాటు వాటర్ ప్రెజర్ లేదని మోటార్లు పెట్టి నీటిని తీసుకోవడం వల్ల కలుషిత నీరు ఇళ్లకు చేరిందని" అధికారులు తెలిపారు.

**మెరుగైన చికిత్సకు వైద్య నిపుణులు**

అనంతరం కల్తీ పాల ఘటన, బాధితులకు అందుతోన్న వైద్య సాయంపై సీఎంకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ వివరించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ......"ఈ నెల 22 తేదీ జరిగిన కల్తీ పాల ఘటన వెలుగులోకి వచ్చింది. 20 మంది కల్తీ పాల కారణంగా అనారోగ్యం పాలయ్యారు. ఈ వ్యవహారంలో ఐదుగురు మృతి చెందారు. 15 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కల్తీ పాల సరఫరా జరిగిన చౌడేశ్వరీ నగర్, స్వరూప్ నగర్‌లో 9 వైద్య బృందాలను నియమించాం. 110 ఇళ్లను సందర్శించి 315 మంది నుంచి రక్త నమూనాలు కూడా సేకరించి విశ్లేషిస్తున్నాం. కల్తీ పాలను సేవించిన 957 మందిని ప్రతీ రోజూ పరీక్షిస్తున్నాం. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం కూడా అందించాం. ఈ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ వైద్య బృందాలను కూడా అందుబాటలో ఉంచాం. ఈ ఘటనలో నిందితుడైన పాల సరఫరాదారు అడ్డాల గణేశ్వరరావుపై క్రిమినల్ కేసు నమోదు చేసి కస్టడీకి తీసుకుని విచారణ చేస్తున్నాం. అసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 8 మంది పరిస్థితి ఇప్పటికీ క్రిటికల్‌గా ఉందని...ఇతర ప్రాంతల నుంచి వైద్య పరికరాలు తెప్పించి, నిపుణులైన డాక్టర్లను తీసుకొచ్చి వైద్యం అందిస్తున్నాం. మిగిలిన ప్రాణాలు కాపాడేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాం" అని వివరించారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా తనిఖీ చేస్తున్నారని అధికారులు వివరించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, నిమ్మల రామనాయుడుతో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లా నుంచి ఆన్ లైన్ విధానంలో రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, శ్రీకాకుళం, రాజమండ్రి ఎమ్మెల్యేలతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

### ఆగి ఉన్న లారీని ఢీకొట్టి..

# ఇంజినీరింగ్ విద్యార్థిని దుర్మరణం



**బాపట్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థిని సహస్ర (20) ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన బాపట్ల జిల్లా వాడరేవు-పిడుగురాళ్ల మార్గంలో చోటు చేసుకుంది. స్కూటీపై వెళ్తున్న సహస్ర ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అఖిల్ అనే యువకుడికి తీవ్ర గాయాలుకాగా.. గుంటూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన సహస్ర గుంటూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతోంది.

# ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌పై అరెస్ట్ వారెంట్ జారీ




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** బిహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌పై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వైకాపా హయాంలో సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ నమోదైన కేసులో గుంటూరులోని మొబైల్ కోర్టు దీన్ని జారీ చేసింది. విచారణ కోసం గుంటూరు పోలీసులు ఇచ్చిన నోటీసులపై సునీల్ నాయక్ స్పందించకపోవడంతో అతడిని అరెస్టు చేసేందుకు ఇటీవల ఎస్పీ దామోదర్ బృందం బిహార్ రాజధాని పట్నాకు వెళ్లింది. అయితే ట్రాన్సిట్ వారెంట్ జారీ చేసేందుకు అక్కడి హైకోర్టు నిరాకరించింది. ఈ నేపథ్యంలో గుంటూరు మొబైల్ కోర్టులో పోలీసులు అరెస్ట్ వారెంట్ పిటిషన్ వేశారు.

### రూ.102 కోట్ల బంగారం స్మగ్లింగ్ కేసు..

# ఛార్జ్‌షీట్‌లో నటి రన్యారావు పేరు



**బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అక్రమ బంగారం తరలించిన కేసులో అరెస్టైన కన్నడ నటి రన్యారావు మరిన్ని చిక్కుల్లో పడింది. రూ.102 కోట్ల బంగారం స్మగ్లింగ్ కేసులో ఆమెపై ఆరోపణలు రాగా.. తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో ఆమె పేరు కూడా ఉంది. స్మగ్లింగ్ సిండికేట్ ఒక ఏడాదిలో 127 కిలోల బంగారాన్ని భారత్‌కు స్మగ్లింగ్ చేసిందని ఆరోపణలు వచ్చాయి. తమ హ్యాండ్లర్లు, ఆభరణాల వ్యాపారులు దానిని దేశీయ మార్కెట్‌లోకి చొప్పించారని ఈడీ దర్యాప్తులో గుర్తించింది. దీంతో బెంగళూరులోని పీఎంఎల్ఏ కోర్టులో ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. దానిలో రన్యా పేరుతో పాటు ఆమె సహాయకుడిగా భావిస్తోన్న తరుణ్ కొండూరు, బళ్లారికి చెందిన గోల్డ్ డీలర్ సాహిల్ జైన్ పేర్లను చేర్చింది. దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ రన్యారావు గతేడాది బెంగళూరు విమానాశ్రయంలో దొరికిపోయిన విషయం తెలిసిందే. ఆమె నుంచి 14.7 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాలో కొన్నేళ్లుగా ఆమె ప్రధాన పాత్ర పోషించినట్లు దర్యాప్తులో భాగంగా అధికారులు గుర్తించారు. ఆమె స్మగ్లింగ్ నెట్‌వర్క్‌తో కలిసి పనిచేసిందని వెల్లడించారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు బంగారం అక్రమ రవాణా చేసేందుకు భారీ మొత్తంలో కమిషన్ తీసుకునేదని పేర్కొన్నారు. ఈ కేసులో ఆమెకు ఏడాది జైలు శిక్ష పడిన సంగతి తెలిసిందే.

# న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది

### NCERT వివాదాస్పద బుక్‌ను నిషేధించిన సుప్రీం



**విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతిపై ఒక అధ్యాయాన్ని ప్రచురించడం వివాదం అవుతోంది. ఈ అంశాన్ని సుమోటోగా పరిగణించిన సుప్రీంకోర్టు.. గురువారం విచారణను ప్రారంభించింది. ఇది న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్రేనంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంలో బాధ్యులకు శిక్ష పడాలని సీజేఐ తీవ్రంగా స్పందించారు. ఈ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానానికి కేంద్రం బేషరతుగా క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారాన్ని తాము సమర్థించుకోవడం లేదని ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వెల్లడించారు. ఈ విచారణలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "వాళ్లు ప్రయోగించిన బుల్లెట్‌తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా ఉద్దేశపూర్వకంగా చేసిన చర్యగా కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా ఇలాగే వదిలేస్తే.. ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది" అని ఆందోళన వ్యక్తంచేశారు. "అలాగే న్యాయవ్యవస్థ పాత్ర వివరించేందుకు ఒక పూర్తి అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ కేటాయించింది. కానీ కోర్టుల విశిష్ట చరిత్రను మాత్రం వదిలేసింది. జవాబుదారీతనం ఏర్పడేవరకు ఈ వ్యవహారాన్ని మేం వదిలివేయబోం. దీనికి వెనక ఎవరు ఉన్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం" అని వ్యాఖ్యానించారు. అలాగే ఎన్‌సీఈఆర్‌టీ వివాదాస్పద పుస్తకంపై నిషేధం విధించింది. ఆ నిషేధాన్ని ఉల్లంఘిస్తే.. కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఆ సంస్థ డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా తుషార్ మెహతా స్పందిస్తూ.. న్యాయవ్యవస్థకు తామెప్పుడూ అండగా ఉంటామన్నారు. పబ్లిక్ నోటీసు ద్వారా బేషరతుగా క్షమాపణలు చెప్తామని కోర్టుకు తెలియజేశారు. తదుపరి విచారణ మార్చి 11న జరగనుంది.

**ఇదీ జరిగింది..**

పుస్తకంలో న్యాయవ్యవస్థపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం దానిపై స్పందించిన సీజేఐ.."న్యాయవ్యవస్థకు కళంకం ఆపాదించేలా ఎవరు ప్రవర్తించినా అనుమతించను" అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించిన పాఠ్యాంశంతో కూడుకున్న పుస్తక పంపిణీని నిలిపివేయాల్సిందిగా ఎన్‌సీఈఆర్‌టీని కేంద్ర విద్యాశాఖ ఇప్పటికే ఆదేశించింది. అసంబద్ధమైన విషయాలు పాఠ్యాంశంలో వచ్చాయని, నిర్ణయం తీసుకోవడంలో పొరపాటు వల్ల ఇలా జరిగిందని ఎన్‌సీఈఆర్‌టీ తెలిపింది. పాఠ్యపుస్తకాన్ని అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. అసంబద్ధమైన అంశాలను ప్రచురించినందుకు క్షమాపణ చెప్పింది.

# ఎడిటర్ వాయిస్

## ముద్రగడ మ్యాజిక్ పనిచేయడం లేదా?

ఇదిలా ఉంటే ముద్రగడ కాపుల గురించి ఏమి మాట్లాడినా గతంలో ఆయనకు మద్దతు ఉండేది. ముద్రగడ పద్మనాభం. అలియాస్ పద్మనాభరెడ్డి. ఆయన వైసీపీలో కీలక నాయకుడిగా ప్రస్తుతం ఉన్నారు. ఆయన 2024 ఎన్నికల ముందు ఒక భీకరమైన శపధం చేశారు. తాను జనసేన అధినేత పవన్ ని పిఠాపురంలో ఓడిస్తాను అని. ఒకవేళ అది సాధ్యపడకపోతే తన పేరు మార్చుకుంటాను అని. నిజానికి ఈ సవాల్ ఆయన తానుగా చేశారు, ఎవరూ చేయమనలేదు, ఆవేశంతో చేసిన ఈ సవాల్ ని ఆ తరువాత ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు కూడా. కానీ ముద్రగడ మాత్రం పట్టుదలగా తన పేరుని మార్చేసుకున్నారు.

**అదే బూమరాంగ్ :** ముద్రగడకు అదే బూమరాంగ్ అయింది అని అంటున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభంజనం స్పష్టంగా ఉంది. పైగా పవన్ కళ్యాణ్ ని గెలిపించాలని పిఠాపురం జనాలు డిసైడ్ అయ్యారు. ఇవన్నీ రాజకీయంగా విశేష అనుభవం కలిగిన ముద్రగడకు తెలియవా అన్నది పెద్ద ప్రశ్న. ఇక ఆయన తొలుత జనసేనలో చేరాలని అనుకున్నారని ఆ తరువాత అడుగులు వైసీపీ వైపు పడ్డాయని మరో ప్రచారం సాగింది. ఇక వైసీపీలో ఉంటూ ముద్రగడ పవన్ మీదనే రాజకీయ యుద్ధం ప్రకటించడం కాపు సామాజిక వర్గానికి నచ్చలేదని అంటారు. దాంతో నాటి నుంచే ముద్రగడ పట్ల కాపులు కొంత ఎడం పాటిస్తున్నారు అని అంటున్నారు.

**మాట్లాడినా :** ఇదిలా ఉంటే ముద్రగడ కాపుల గురించి ఏమి మాట్లాడినా గతంలో ఆయనకు మద్దతు ఉండేది. కానీ ఇపుడు మాత్రం ఆయన మాటలు చేస్తున్న ప్రకటనలు అన్నీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చేస్తున్నది కూడా ఒక బలమైన సామాజిక వర్గంగా ఉన్న కాపులే అని అంటున్నారు. తాజాగా ముద్రగడ అంబటి రాంబాబుని పరామర్శించడానికి ఇంటికి వెళ్ళారు. ఆ తరువాత మీడియాతో మాట్లాడుతూ ఆయన కాపుల మీద టీడీపీ దాడులు అదే పనిగా చేస్తోంది అని విమర్శించారు. ఎపుడు అధికారంలోకి టీడీపీ వచ్చినా కూడా ఇదే విధంగా చేస్తున్నారు అని 2016లో తనను 2026లో అంబటి రాంబాబుని ఇలా దాడులు చేసి కుటుంబాల మీదకు వచ్చారని ఆయన తీవ్ర విమర్శలు చేశారు.

**వైసీపీ నేతగానే :** సహజంగా ముద్రగడ మాట్లాడితే కాపు సామాజిక వర్గం నుంచి పెద్ద ఎత్తున సానుకూల స్పందన రావాలి. కానీ ఆయన కామెంట్స్ ని సొంత వారే వైరల్ చేసి ట్రోల్ చేస్తున్నారు. దానికి కారణం పెద్దాయనగా ఉన్న ముద్రగడ నిలకడ లేని రాజకీయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇక ఆయన పేరుని పద్మనాభరెడ్డి అని మార్చుకోవడం కూడా ఎవరికీ అసలు నచ్చడం లేదుట. దాంతో వైసీపీ నేతగానే ముద్రగడను చూస్తున్నారు తప్ప కాపుల కోసం ఉద్యమించిన గత ముద్రగడగా భావించడం లేదుట. దాంతో పెద్దాయన మ్యాజిక్ గోదావరి జిల్లాలో పెద్దగా పనిచేయడం లేదని అంటున్నారు. మరి ముద్రగడ ఈ విషయాల మీద విశ్లేషణ చేసుకుని బలమైన సామాజిక వర్గాన్ని ఆకట్టుకునేలా తిరిగి తన వ్యూహాలను అమలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## గుట్టలు గుట్టలుగా నోట్ల కట్టలు

**రూ.30 వేల కేసులో సోదాలు చేస్తుంటే బయటపడిన 4 కోట్లు**
**ఒడిశాలో గనులశాఖ అధికారి అరెస్టు**
**అధికారి దేబబ్రత మహంతి ఇంట్లో గుర్తించిన నోట్ల కట్టలు**



**రాయగడ పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒడిశాలో రూ.30 వేల లంచం కేసులో తీగ లాగితే రూ.కోట్లకు పడగలెత్తిన ఓ అధికారి అవినీతి వ్యవహారం బయటపడింది. ఈ ఘటనకు సంబంధించి ఆ రాష్ట్ర అధికారులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం. గనుల శాఖ కటక్ సర్కిల్‌లో ఉప సంచాలకునిగా విధులు నిర్వర్తిస్తున్న దేబబ్రత మహంతి.. ఓ బొగ్గు విక్రేత నుంచి రూ.30 వేల లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికారులకు చిక్కారు. దీంతో కేసు నమోదుచేసి ఆయన ఆస్తులపై మంగళవారం రాత్రి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్‌లోని ఆయన నివాసంలో అనేక నోట్ల కట్టలను గుర్తించారు. వాటిని లెక్కకట్టి మొత్తం రూ.4.27 కోట్లని తేల్చారు. దీంతోపాటు ఆయన కార్యాలయంలో వ్యక్తిగత టేబుల్ నుంచి మరో రూ.1.20 లక్షలు, నివాసంలో 305.40 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండిని గుర్తించారు. సోదాల అనంతరం మహంతిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు విజిలెన్స్ డైరెక్టర్ యశ్వంత్ జెత్వా తెలిపారు. రాష్ట్ర చరిత్రలో అవినీతి నిరోధక విభాగం స్వాధీనం చేసుకున్న అత్యధిక మొత్తం ఇదేనని వెల్లడించారు. 'మహంతికి 10 బ్యాంకు ఖాతాలు, లాకర్లు ఉన్నట్లు గుర్తించాం. భువనేశ్వర్‌లో రెండంతస్థుల భవనం ఉంది. ఆయనపై 2009లోనే ఒక అవినీతి కేసు నమోదు కాగా ప్రస్తుతం కోర్టులో విచారణ దశలో ఉంది' అని వివరించారు.


## రెండో పెళ్లి చేసుకోవాలనే ఆలోచనతో.. నిండు గర్భిణి హత్య

**నిద్రిస్తుండగా గొంతు నులిమి.. సహజ మరణంగా చిత్రీకరించిన భర్త – ఎట్టకేలకు అరెస్టు**



**ఇందల్‌వాయి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇప్పటికే ముగ్గురు కుమారులకు జన్మనిచ్చి.. మరికొన్ని రోజుల్లో మరో బిడ్డకు జన్మనివ్వబోతున్న నిండు గర్భిణి భర్త చేతిలో హత్యకు గురైంది. ఈ నెల 22న నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం గన్నారం గ్రామంలో చోటుచేసుకున్న ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ వినోద్, ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. గన్నారం గ్రామానికి చెందిన నాగేష్‌కు కామారెడ్డి పట్టణం తిమ్మక్‌పల్లికి చెందిన సుమలత(32)తో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు. సుమలత ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భిణి. మద్యానికి బానిసైన నాగేష్.. భార్యను తరచూ శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలో భార్యను శాశ్వతంగా వదిలించుకుని..రెండో పెళ్లి చేసుకోవాలనే ఆలోచన చేశాడు. 22వ తేదీ అర్ధరాత్రి నిద్రిస్తున్న భార్య గొంతునులిమి హత్య చేశాడు. మరుసటి రోజు ఉదయం 'తన భార్య నిద్రలోనే మృతిచెందినట్లు' బంధులకు చెప్పాడు. సహజ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. 'అల్లుడి ప్రవర్తనలో తేడాను గమనించిన హతురాలి తల్లి బాలరాజవ్వ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమార్తె మరణంపై అనుమానం వ్యక్తంచేశారు. ఆ ప్రకారం విచారణ చేపట్టగా..తానే హత్య చేసినట్లు నాగేష్ అంగీకరించాడు. నిందితుడిని రిమాండ్‌కి తరలించాం' అని సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

## తిరుమల ఘాట్ రోడ్డులో అదుపుతప్పిన బైక్.. ఒకరి మృతి



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల డౌన్ ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగింది. 30వ మలుపు వద్ద బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడిని తమిళనాడులోని అరక్కోణం తాలూకా మిట్టపెట్టై గ్రామానికి చెందిన నటరాజన్‌గా గుర్తించారు. తీవ్రగాయాలైన మునిరత్నంకు తిరుపతి స్విమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు.

## పెళ్లి వేడుకలో వధువుపై కాల్పులు






**విశ్వం వాయిస్ న్యూస్ :** బిహార్‌లోని బక్సర్ జిల్లా మల్లాహ్ టోలిలో వివాహ వేదికపై ఉన్న నవవధువు ఆర్తి కుమారి (19)పై కాల్పులు జరిగాయి. అనూహ్యమైన ఈ ఘటనతో అతిథులు భయభ్రాంతులై ఇటూ అటూ పరుగులు తీశారు. పూలదండలు మార్చుకునే వేడుకలో అర్ధరాత్రి వేళ ఈ ఘటన జరిగింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువతిని వారణాసి ఆసుపత్రికి తరలించారు. బాగా దగ్గర నుంచి కాల్చడంతో ఆర్తి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. నిందితుడు వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు. ఇతడిని దీన్‌బంధుగా పోలీసులు గుర్తించారు. తాను ప్రేమించిన యువతి మరో వ్యక్తిని పెళ్లాడుతోందన్న కోపంతో అతడు కాల్పులు జరిపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు గతంలో మద్యం కేసులో జైలుకు వెళ్లొచ్చాడు. అతడి కోసం గాలింపు ముమ్మరం చేసినట్లు బక్సర్ డీఎస్పీ గౌరవ్ పాండే తెలిపారు.

**లొంగిపోతానన్నాడని..**

## కమాండర్‌ను చంపిన మావోయిస్టు నాయకుడు

**విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీసుల ముందు లొంగిపోవడానికి సిద్ధమైన మావోయిస్టు కమాండర్ అన్వేష్ హత్యకు గురయ్యాడు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నాయకుడు సుక్రునే ఈ హత్య చేశాడని పోలీసులు పేర్కొన్నారు. ఒడిశాలో జనవరి 29న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దారింగ్‌బాడి పోలీస్‌స్టేషన్ పరిధి లోని పకారి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో అన్వేష్ అలియాస్ రేణు కుళ్లిపోయిన మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఒడిశా పోలీసుల ముందు కొందరు కమాండర్‌లతో కలిసి లొంగిపోయేందుకు అన్వేష్ సిద్ధమవగా, సుక్రు అతడి అనుచరులు సిలా, జగేష్‌లు దానిని వ్యతిరేకించారన్నారు. ఈ క్రమంలోనే అన్వేష్‌ను హత్య చేసినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా ప్రాంతానికి చెందిన అన్వేష్ తలపై రూ.22 లక్షల రివార్డ్ ఉందన్నారు. ఇటీవల కంధమాల్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జగేష్ ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. కాగా.. పోలీసుల ముందు లొంగిపోవడంపై మావోయిస్టు గ్రూపులలో అంతర్గత విభేదాలు తలెత్తుతున్నాయని ఈ ఘటన ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ మెట్రోస్టేషన్ సమీపంలో భారీ అగ్నిప్రమాదం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఓ వస్త్ర దుకాణంలో మంటలు ఎగసిపడ్డాయి. అక్కడ ఏర్పాటు చేసిన గోపురం డెకరేషన్‌కు మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. మూడు ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

# వనిత వాయిస్

## వైఫల్యాల్ని అధిగమించి.. కెరీర్లో రాణించాలంటే..

వృత్తిఉద్యోగాల్లో మనం ఎన్నో లక్ష్యాలు పెట్టుకుంటాం.. వాటిలో కొన్ని సఫలమవ్వచ్చు.. మరికొన్ని విఫలమవ్వచ్చు. అయితే చాలామంది ఇలాంటి వైఫల్యాల గురించే ఆలోచిస్తూ ఇక తాము కెరీర్‌లో రాణించలేమనుకుంటారు. ఇతరులతో పోల్చుకుంటూ తీవ్ర ఒత్తిడిలోకి కూరుకుపోతుంటారు. నిజానికి ఇలాంటి ప్రతికూల భావాలే కెరీర్ తిరోగమనానికి కారణమవుతాయంటున్నారు నిపుణులు. అందుకే వైఫల్యాల్ని కూడా సానుకూలంగా స్వీకరించి.. వాటి నుంచి కొత్త పాఠాలు నేర్చుకోగలిగితే కెరీర్‌ను తిరిగి గాడిలో పెట్టుకోవచ్చంటున్నారు. మరి, కెరీర్‌లో విఫలమయ్యామని ఎప్పుడనిపిస్తుంది? దానిని అధిగమించి ముందుకు సాగడమెలాగో తెలుసుకుందాం రండి..

**ఇవే కారణమా?**

- ఏ పని చేయాలన్నా ప్రణాళిక ముఖ్యం. కెరీర్‌లో విజయవంతంగా ముందుకెళ్లాలన్నా ప్లానింగ్ తప్పనిసరి! అయితే కొంతమంది దీన్ని విస్మరిస్తుంటారు. ఎలాంటి ప్రణాళిక లేకుండా చేతికొచ్చిన పనిని చేసుకుంటూ ముందుకు సాగుతుంటారు. దీనివల్ల ఎంత పనిచేసినా సంతృప్తి కలగదు.. సరికదా కెరీర్‌లో ఆశించిన స్థాయిలో వృద్ధి లేక ఒకానొక సమయంలో విఫలమయ్యామన్న వైరాగ్య భావన ఆవహిస్తుంది.
- కొంతమంది కెరీర్‌లో అయినా, జీవితంలోనైనా సాధ్యం కాని లక్ష్యాల్ని నిర్దేశించుకుంటారు. వాటిని చేరుకునే క్రమంలో ఎంతో శ్రమ పడతారు.. కానీ ఆశించిన ఫలితం దక్కదు. ఇలాంటప్పుడు ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. ఇది క్రమంగా విఫలమయ్యామన్న భావన కలిగేలా చేస్తుంది.
- చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్క.. తాత్కాలికంగా ఏదో ఒక ఉద్యోగంలో చేరుతుంటారు కొందరు. ఇటు ఈ ఉద్యోగం చేస్తూనే.. తాము కోరుకున్న కెరీర్‌పై దృష్టి పెడుతుంటారు. ఒకవేళ ఆశించిన ఉద్యోగం లభించకపోతే ఒక రకమైన అసహనానికి, కెరీర్ విఫలమైందన్న భావనకూ లోనవుతుంటారు.
- ఉద్యోగంలో ఎవరి సామర్థ్యాలు వారివి! ఒకరికి అప్పగించిన పనిని వేగంగా పూర్తి చేయగలిగే సామర్థ్యముండచ్చు.. మరొకరికి ఎన్ని పనులైనా ఒంటి చేత్తో నిర్వహించే సత్తా ఉండచ్చు.. ఇంకొకరికి టెక్నాలజీపై పట్టుండచ్చు.. అయినా కొంతమంది తమ సామర్థ్యాల్ని పక్కన పెట్టి ఇతరులతో పోల్చుకుంటుంటారు. ఇది కూడా తాము కెరీర్‌లో విఫలమయ్యామన్న భావనను కలిగిస్తుందంటున్నారు నిపుణులు.
- కెరీర్‌ని విజయవంతంగా కొనసాగించాలంటే ఆరోగ్యం కూడా అందుకు సహకరించాలి. అయితే కొంతమందిలో పలు శారీరక సమస్యలుండచ్చు.. మరికొంతమందికి వ్యక్తిగత/వృత్తిపరమైన కారణాల వల్ల మానసిక సమస్యలు



ఎదురుకావచ్చు. ఇలాంటి సమయంలో చేసే పనిపై పూర్తి దృష్టి పెట్టలేం. దాంతో అటు కెరీర్‌లో వృద్ధి, ఇటు వ్యక్తిగత జీవితంలో సంతృప్తి లేవన్న భావన వెంటాడుతుంది.

- కొంతమంది కెరీర్‌లో పూర్తి చేయాల్సిన లక్ష్యాల్ని పకడ్బందీగా నిర్దేశించుకుంటారు. కానీ వాటిని ఆచరణలో పెట్టే విషయంలో జాప్యం చేస్తుంటారు. పనుల్ని పూర్తిచేసే విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. దీనివల్ల కూడా లక్ష్యాల్ని సరైన సమయంలో చేరుకోలేక.. విఫలమయ్యామన్న భావన దరిచేరుతుందంటున్నారు నిపుణులు.
- వృత్తిఉద్యోగాల్లో మనం ఎంత చురుగ్గా వ్యవహరించినా.. మన చుట్టూ ఉన్న కొందరు మనల్ని వెనక్కి లాగాలని చూస్తుంటారు. విమర్శలు, నెగెటివ్ మాటలతో మనలో ప్రతికూల భావనలు కలిగేలా చేస్తారు. ఇలాంటి వ్యక్తులకు ప్రభావితమైనా కెరీర్‌లో ఏమీ సాధించలేకపోతున్నామన్న భావన కలగడం సహజం.
- కొంతమంది విషయంలో కెరీర్ ప్రణాళిక అంతా బాగానే ఉంటుంది.. కానీ ఆయా పనులు పూర్తిచేయడానికి సంబంధించిన ఉత్సాహం కొరవడుతుంది. దీనివల్ల కూడా పనులు అనుకున్న సమయానికి పూర్తికాక.. కెరీర్ విఫలమైందన్న ఒక రకమైన అసహనం దరిచేరుతుంది.

**అధిగమిస్తేనే అందలం!**

- జీవితంలోనైనా, కెరీర్ పరంగానైనా.. తమకెదురైన వైఫల్యాల్ని చాలామంది స్వీకరించరు. తమకే ఎందుకిలా? అన్న ప్రతికూల భావనలోకి కూరుకుపోతారు. కానీ ఇలా ఆలోచించడం కంటే.. 'జరిగిందేదో జరిగిపోయింది.. మరోసారి ఇలా జరగకుండా జాగ్రత్తపడాల'న్న సానుకూల దృక్పథంతో ముందుకు సాగినప్పుడే.. కెరీర్ వృద్ధి సాధ్యమవుతుందంటున్నారు నిపుణులు.
- 'ఓటమి గెలుపుకి తొలి మెట్టు' అంటారు. అంటే.. ఓటమికి గల కారణాల్ని పసిగట్టి.. వాటి నుంచి పాఠాలు నేర్చుకుంటూనే.. అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తపడినప్పుడే కెరీర్ వైఫల్యాల్ని సులభంగా అధిగమించచ్చంటున్నారు నిపుణులు.
- 'నా పనేదో నాది.. ఇతరులతో సంబంధం లేదన్న'ట్లుగా పని ప్రదేశంలో కొంతమంది రిజర్వ్‌డ్‌గా వ్యవహరిస్తుంటారు. కెరీర్‌లో వెనకబడినప్పుడు ఇలాంటి వారికి తోటి వారి నుంచి ఎలాంటి సహాయం అందదు. కాబట్టి వృత్తిఉద్యోగాల్లో తోటి ఉద్యోగులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడం, ఇతర సంస్థల్లో పనిచేసే స్నేహితులతో స్నేహబంధం కొనసాగించడం వల్ల.. కెరీర్‌లో ఎదురయ్యే సమస్యల్ని అధిగమించడం సులభమవుతుందంటున్నారు నిపుణులు.
- ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్న ఎంతోమంది తమ కెరీర్ మొదట్లో వైఫల్యాలను ఎదుర్కొన్న వారే! కాబట్టి వాళ్ల స్ఫూర్తి గాథల గురించి తెలుసుకుంటే ప్రోత్సాహకరంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాల్లో ప్రతికూలతల్ని ఎలా అధిగమించాలో కూడా వాళ్ల నుంచి నేర్చుకోవచ్చు.
- వైఫల్యాలు ఎదురయ్యాయని వాటినే తలచుకుంటే అక్కడే ఆగిపోతాం. అదే ఆ ప్రతికూల ఆలోచనల్ని అధిగమించి.. ఆసక్తి ఉన్న అంశాలపై దృష్టి పెడితే.. కొత్త విషయాలు నేర్చుకోగలుగుతాం.. ఇదీ పరోక్షంగా మన కెరీర్‌కి ప్లస్ అవుతుంది.
- ఎంత నేర్చుకున్నా, ఎన్ని నైపుణ్యాల్లో పట్టు సాధించినా నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే మన కెరీర్ అవకాశాల్ని విస్తరించుకోగలుగుతాం. అందుకే వైఫల్యాల్ని పక్కన పెట్టి మీ చదువుకు తగ్గ ఇతర కెరీర్ అవకాశాలపై దృష్టి పెట్టమంటున్నారు నిపుణులు. దీనివల్ల ఇటు కెరీర్ అభివృద్ధి సాధించచ్చు.. అటు ఆర్థికంగానూ మరింత దృఢం కావచ్చు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం, 27 ఫిబ్రవరి 2026




www.viswamvoice.com

స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న

## అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

న్యూఢిల్లీలో నిర్వహించిన కార్మిక, జౌళీ, నైపుణ్యాభివృద్ధి సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో అమలాపురం లోక్‌సభ సభ్యుడు గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. కేంద్ర పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన ఈ కీలక సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లను కమిటీ సమగ్రంగా పరిశీలించింది. ప్రధానంగా నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ, జౌళీ మంత్రిత్వ శాఖ, అలాగే కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు, పథకాలు, వ్యయ వివరాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చ జరిగింది. ప్రతిపాదిత బడ్జెట్ కేటాయింపులు, పథకం వారీగా ఖర్చుల వివరాలు, ఇప్పటివరకు నిధుల వినియోగ ధోరణులు, ముఖ్య కార్యక్రమాల కింద సాధించిన భౌతిక పురోగతి వంటి అంశాలను సభ్యులు విశ్లేషించారు. దేశవ్యాప్తంగా యువతకు నైపుణ్యాలు పెంపొందించడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం, జౌళీ రంగాన్ని ప్రోత్సహించడం మరియు కార్మిక సంక్షేమాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రభావాన్ని కమిటీ సమీక్షించింది. కేటాయించిన నిధులు వాస్తవికంగా ఉపాధి, జీవనోపాధి మరియు పారిశ్రామిక అభివృద్ధిపై స్పష్టమైన ఫలితాలను అందించాలంటే ఫలితాల ఆధారిత బడ్జెటింగ్ విధానం, ఆర్థిక క్రమశిక్షణ, నిధుల సమర్థ వినియోగం అత్యంత



అవసరమని కమిటీ స్పష్టం చేసినట్లు ఎంపీ గంటి హరీష్ బాలయోగి తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు గరిష్ట స్థాయిలో ప్రజలకు ఉపయోగపడేలా అమలు పద్ధతుల్లో పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి, సమయపాలన ఉండాలని సమావేశంలో సభ్యులు సూచించినట్లు ఆయన వివరించారు. రాష్ట్రాల అవసరాలు, పరిశ్రమల అభివృద్ధి దిశగా తీసుకోవాల్సిన చర్యలు, నైపుణ్య శిక్షణా కేంద్రాల పనితీరు వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ జరిగినట్లు తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కార్మిక, జౌళీ, నైపుణ్యాభివృద్ధి రంగాల పాత్ర కీలకమని, ఈ రంగాలకు కేటాయించిన ప్రతి రూపాయి సమర్థంగా వినియోగించబడేలా పార్లమెంటరీ కమిటీలు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నాయని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా మహిళా రక్షణపై

## విస్తృత అవగాహన కార్యక్రమాలు

### జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



జిల్లా వ్యాప్తంగా మహిళా రక్షణ, చట్టాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినట్లు ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలు, విద్యార్థులు, ప్రజల రక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక రుగ్మతల నిర్మూలనపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మహిళలు, యువతుల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించి, ఆపద సమయంలో శక్తి బృందాల సేవలను ఎలా పొందాలో వివరించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, సామాజిక మాధ్యమాల వేధింపుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనలు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలకు వేధింపులు కలగకుండా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా శక్తి బృందాలు, శాంతి బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, పిల్లల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా గస్తీ, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.


కోనసీమ తిరుమల వాడపల్లిలో

## రూ.2.17కోట్ల రికార్డు స్థాయి హుండీ ఆదాయం

### రికార్డు స్థాయిలో ఆదాయం రావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ కమీషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు

**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం జరిగిన హుండీల లెక్కింపు కార్యక్రమంలో రికార్డు స్థాయిలో రూ.2.17 కోట్ల ఆదాయం లభించింది. గత 35 రోజుల కాలానికి గాను ఈ మొత్తం లభించింది. ఇందులో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయం మరియు శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీల ద్వారా రూ.1,58,00,536/- నగదు, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.59,82,822ల నగదు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదేవిధంగా భక్తులు సమర్పించిన కానుకలుగా 42 గ్రాముల 400మిల్లీ గ్రాముల బంగారం, 1 కిలో 280 గ్రాముల వెండి, అలాగే 13 దేశాలకు చెందిన 73 విదేశీ కరెన్సీ నోట్లు హుండీలలో లభించాయని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమానికి ఆలయ ధర్మకర్తలు సిహెచ్ రాంబాబు, సలాది నాగేశ్వరరావు, పి.భవాని, సిహెచ్.సత్యనారాయణ, ఎస్.సూర్య





కుటుంబరావు, ఎమ్.త్రిమూర్తులు హాజరయ్యారు. పర్యవేక్షణాధికారులుగా మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం అసిస్టెంటు కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి (ఎఫ్ ఏ7 సీ) డి.సురేశ్ బాబు, పలివెల గ్రూపు 2 దేవాలయాల ఈవో పివివిఎస్ కామేశ్వరరావు, ఆత్రేయపురం గ్రూపు 3 దేవాలయాల ఈవో బి.నరేంద్ర కుమార్ వ్యవహరించారు.హుండీ ఆదాయం లెక్కింపుకు కరూర్ వైశ్య బ్యాంక్, రావులపాలెం, కెనరా బ్యాంక్, రావులపాలెం వారు సహకారం అందించారు. అలాగే అర్చకస్వాములు, వేదపండితులు, గ్రామస్థులు, శ్రీవారి సేవకులు, పత్రికా ప్రతినిధులు, పోలీసులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి & డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు మాట్లాడుతూ ఈ సారి రికార్డు స్థాయిలో రూ2.17 కోట్ల ఆదాయం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. దేవస్థానం పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు మాట్లాడుతూ భక్తుల సహాయ, సహకారాలతో ఆలయంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.


## మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

### అవకాశాన్ని వినిగించుకోవాలి : జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మార్చి 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించ బడనున్నట్లు నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (జాతీయ న్యాయసేవాధికార సంస్థ) చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు తదితర అంశాలకు సంబంధించిన వివాదాలను వేగవంతంగా, సఖ్యతా పూర్వకంగా పరిష్కరించు కోవచ్చునని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ ద్వారా ముగించు కోవాలని ఆమె సూచించారు.


## రాజకీయ పార్టీ ప్రతినిధులతో తహసిల్దార్ సమావేశం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట తహసిల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం మధ్యాహ్నం ఎన్నికల సహఅధికారి తహసిల్దార్ పి తేజేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల దరఖాస్తు ఫారములు-6, 7, 8 పై వివరణ ఇచ్చారు. స్పెషల్ ఇన్ టెన్సివ్ రివిజన్‌కి సంబంధించి ఓటర్ల మ్యాపింగ్ లు,ప్రోగెనీ మ్యాపింగ్ల గురించి తెలిపారు.ఈ సమావేశంలో ఉంగరాల రాంబాబు, మేడపాటి రవీంద్ర రెడ్డి, ఎం జె రాజ్ బాబ్, వెత్స దుర్గాప్రసాద్, ఎన్ వి ఎస్ పి.సూర్య ప్రకాష్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ పీఏ.మెహర్ బాబా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎం పద్మనాభం, ఎన్నికల ఆపరేటర్లు జి.ఆంజనేయులు, జి.మల్లేశ్వర రావులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడోత్సవాల్లో మంత్రి కందుల





**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైన "ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ ఆటవిడుపు ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ క్రీడోత్సవాలు-2026" కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడోత్సవాల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది, ప్రజాప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించిన టగ్ ఆఫ్ వార్, రన్నింగ్, వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడల్లో పాల్గొని ఉత్సాహాన్ని పంచుకున్నాను. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు జట్టు భావన, క్రమశిక్షణ, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయి. ప్రజాసేవలో నిమగ్నమైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తూ మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేయడానికి ప్రేరణనిస్తాయి.

## నాలుగు మండలాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది

### నిధులు కేటాయించాలని అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ




**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం నియోజకవర్గంలోని అయినవిల్లి అంబాజీపేట పి.గన్నవరం మామిడి కుదురు నాలుగు మండలాల్లో డ్రైనేజీ వ్యవస్థ చాలా అధ్వానంగా ఉందని అందమైన రోడ్డు వేసిన డ్రైనేజీ లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని అనారోగ్యానికి గురవు తున్నారని ఈరోజు జరిగిన అసెంబ్లీ సమావేశంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్య నారాయణ ప్రస్తావించారు. నాలుగు మండలాల డ్రైనేజీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆయా శాఖ మంత్రి కోరారు.

సర్ సి.వి. రామన్ పాఠశాలలో

## 10వ తరగతి విద్యార్థులకు వృత్తి మార్గదర్శక సమావేశం

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అమలాపురం సర్ సి.వి. రామన్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల కోసం వృత్తి మార్గదర్శక (కెరీర్ కౌన్సెలింగ్) సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని టూ టైమ్స్ సివిల్ ర్యాంకర్, దేనిక్ భారత్ విద్యాసంస్థల డైరెక్టర్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎం. బాలలత నిర్వహించారు. ముఖ్యంగా ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షలకు విద్యార్థులు ఎలా సమర్థంగా సిద్ధం కావాలో వివరణాత్మకంగా తెలియజేశారు. విద్యార్థులు విజయాన్ని సాధించాలంటే క్రమబద్ధమైన అధ్యయన ప్రణాళిక ఎంతో అవసరమని ఆమె స్పష్టం చేశారు. ప్రతి రోజు నిర్దిష్ట సమయ పట్టికను రూపొందించుకుని దాని ప్రకారం చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలపై సంపూర్ణ



అవగాహన పెంపొందించుకోవడం, సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవడం, గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలను సాధన చేయడం ద్వారా పరీక్షా విధానంపై స్పష్టత పొందవచ్చని వివరించారు. బలహీనమైన విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిరంతర సాధన చేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. 600కు 600 మార్కులు లక్ష్యంగా పెట్టుకుని కృషి చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. సమయ నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పరీక్షల సమయంలో ప్రశ్నలను జాగ్రత్తగా చదివి స్పష్టంగా, శుద్ధిగా సమాధానాలు వ్రాయాలని సూచించారు. దృష్టి చెదరగొట్టే అంశాలను దూరంగా ఉంచి ఏకాగ్రతతో చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడం ఎలా అనే విషయంపై కూడా ఆమె మార్గనిర్దేశం చేశారు. సరైన విశ్రాంతి, సమతుల ఆహారం, ధైర్యవంతమైన ఆలోచన విధానం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. 10వ తరగతి అనంతరం తీసుకోవాల్సిన కోర్సులు, భవిష్యత్‌లో ఉన్న అవకాశాలపై విద్యార్థులతో పరస్పర చర్చ నిర్వహించి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్ సి.వి. రామన్ మరియు సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్స్ డైరెక్టర్ రవణం వేణుగోపాల్ రావు, కరస్పాండెంట్ ఆర్. కుమార్, ప్రిన్సిపల్ బి.కేశవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఉపయోగకరమైన ఆచరణాత్మక సూచనలు అందించినందుకు పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన

## పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం మండలం గంటి పెదపూడి ఎంపీటీసీ పల్లి మోసే మేనల్లుడు పులిదిండి భరత్ మోహన్ రాజ్ వివాహం విజయవాడలోని కె హోటల్‌లో ఘనంగా జరిగింది.ఈ శుభసందర్భంగా పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనూతన దంపతులకు ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యసంపదలతో సుఖసంతోషాల నిండిన దాంపత్య జీవితం కలగాలని ఆకాంక్షించారు. ఎండి రిజ్వి. పల్లి మోసే వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నాయకులు మరియు అభిమానులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

శుక్రవారం, 27 ఫిబ్రవరి 2026
www.viswamvoice.com





జిల్లా పౌరసరఫరాల

# విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ తొలి సమావేశం

## జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ఆవిర్భవించిన అనంతరం తొలిసారిగా జిల్లా చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచే విధంగా వినియోగ దారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పౌరసరఫరాల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు కావడం ఆహార భద్రత లక్ష్యిత వర్గాలకు గర్వకారణమని జిల్లా జాయింట్ కలెక్టర్, కమిటీ ఉపాధ్యక్షులు టి. నిశాంతి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల జిల్లా పౌరసరఫరాల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ తొలి సమావేశం కమిటీ ఉపాధ్యక్షుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత చట్టం--2013 అమలులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారించడంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సమీక్షా సమావేశాలకు మాత్రమే పరిమితం కాకుండా రోజువారీ పనితీరులోనూ కట్టుబడి పనిచేయాలని, వ్యవస్థ మెరుగుదలకు సభ్యుల సూచనలు, సలహాలు అవసరమని కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార ధాన్యాల పంపిణీ, నాణ్యత తనిఖీలు, సామాజిక తనిఖీలు నిర్వహించడంతో పాటు ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో ఏర్పడిన కమిటీలు, డివిజన్, చౌకధరల దుకాణాల స్థాయిలో తనిఖీలు, పర్యవేక్షణ ద్వారా బలోపేతం కావాలని, లబ్ధిదారులకు సకాలంలో నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం వంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ అమలు చేయాలన్నారు. గ్రామీణ చౌకధరల దుకాణాల్లో సర్పంచ్‌లు, డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు చైర్మన్‌లుగా వ్యవహరిస్తూ రెగ్యులర్ తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీలు, పోషకాహార కేంద్రాల్లో బరువు తక్కువ పిల్లలు, గర్భిణీలకు కోడిగుడ్లు, పౌష్టికాహారం సక్రమంగా అందేలా మానిటరింగ్ బలోపేతం చేయాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం, వసతిగృహాల్లో పోషక విలువలు మెరుగుపడేలా పోషకాహార బియ్యం సరఫరా చేయాలని సూచించారు. లోపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ మాట్లాడుతూ తొలి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆహార భద్రతపై సుహృద్భావ వాతావరణంలో ఫలవంతమైన చర్చ జరిగిందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ డేటాను డిజిటల్ విధానంలో ట్రాక్ చేయాలని సూచించారు. చట్టం విజయవంతం కావాలంటే అందరి సహకారం అవసరమని తెలిపారు. రేషన్ దుకాణాల పనితీరు, సరుకు పంపిణీ స్థితి, బయోమెట్రిక్ ఆధారిత సరఫరా వ్యవస్థ (ఈ-పాయింట్ ఆఫ్ సేల్ యంత్రాలు) అమలు పరిస్థితి, కార్డుదారులకు సరుకులు సమయానికి అందుతున్నాయా లేదా అన్న అంశాలపై కమిటీ సభ్యులు నిఘా ఉంచాలని సూచించారు. డూప్లికేట్ కార్డుల నిరోధంపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పర్యవేక్షణ, నిల్వదారులపై ఆకస్మిక తనిఖీలు, అధిక ధరల వసూళ్లు, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు గైకొనాలని పేర్కొన్నారు. అవసరమైతే నమూనాలు సేకరించి ప్రయోగశాలలకు పంపించాలని సూచించారు. ఆన్‌లైన్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్సీ కె.సూర్యనారాయణరావు మాట్లాడుతూ జిల్లాలో ఆహార భద్రత, తూనికలు కొలతల అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ ఆహార కల్తీ, తూనికల వ్యత్యాసాలకు తావులేకుండా కమిటీ సభ్యులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. అక్రమ రవాణా, అధిక ధరల వసూళ్లు, నాణ్యత లోపాలపై కఠిన చర్యలు తీసుకునే దిశగా ముందడుగు వేయాలని సభ్యులు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డీఎం సివిల్ సప్లై పి. శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి, ఎంపీటీసీ మట్ట శైలజ, బి.ఎస్.వి. ప్రసాద్, అడపా వెంకటరమణ, అరిగెల వెంకటరామా రావు, జి. రవికుమార్, జంగా బాబురావు, తూనికలు కొలతల అధికారి మోహన్, ఆహార భద్రతాధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.6 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

## రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి మరింత వేగవంతం
## కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రూ.1.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్ల పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం గురువారం శంకుస్థాపన చేశారు. మట్లచెరువు నుంచి బాపనయ్య చెరువు వరకు నిర్మించనున్న ప్రధాన సిసి రోడ్డుకు రూ.97.5 లక్షలు, నెలపర్తిపాడు గ్రామంలో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు రూ.9 లక్షలు కేటాయించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలు సౌకర్యవంతం కావడంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గత 20 నెలల కాలంలో సుమారు రూ.180 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు పెంకే సాంబశివరావు, టేకుమూడి సత్యనారాయణ, పంచాయతీరాజ్ డిఈ శ్రీనివాస్, ఏ.ఈ. ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఈశ్వరుని జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం పంచామృతాలతో అభిషేకం




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం ఈశ్వరుని జన్మనక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 4.00 గంటలకు శ్రీ స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించబడుతున్నది కావున భక్తులు అందరూ పాల్గొనవలసినదిగా కోరడమైనదని సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.

# మా నాయకుడుకి తక్షణమే క్షమాపణలు చెప్పాలి : పాలూరి సత్యానందం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపి శాసన మండలిలో శాసనమండలి బిజెపి ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్సీ సోము వీర్రాజు పై వైసీపీ ఎమ్మెల్సీలు దాడులు సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరిసత్యానందం ఖండించారు.సీనియర్ సభ్యుడిపై ఇలాదాడులకు దిగడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమని విమర్శించారు. సభలో మహిళా మంత్రులు అని కూడా చూడకుండా వైసీపీ సభ్యులు ప్రవర్తించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రాయలసీమ ఎత్తిపోతల పథకంపై చర్చ సందర్భంగా మైకు తీసుకొని మాట్లాడే సమయంలో ప్రశ్న అడగకుండా అడ్డుకునేందుకు మైకు లాక్కొనడానికి ప్రయత్నించి సోముపై వైసీపీ ఎమ్మెల్సీలు చేసిన దాడి ప్రజలు చూస్తున్నారు. ప్రజలు మీపార్టీకి చమరగీతం పాడిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు అయినా మీతీరు మార్చుకోలేదని అన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు "ప్రశ్నించే గొంతును అడ్డుకుంటే చూస్తూ ఊరుకోమని మానాయకుడు కి తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# సీనియర్ సభ్యుడిపై ఇలా దాడులకు పాల్పడటం సిగ్గుచేటు

## ముత్యాల బాబ్జి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు వైసీపీ నేతలు క్షమాపణ చెప్పాలి.శాసనమండలిలో బిజెపి ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజును వైసీపీ నేతలు అడ్డుకోవడమే కాకుండా దాడికి ప్రయత్నించడం శోచనీయం.తక్షణం వైసీపీ నేతలు ఆయనకు క్షమాపణ చెప్పాలి సీనియర్ సభ్యుడిపై ఇలాదాడులకు పాల్పడటం సిగ్గుచేటు.రాయలసీమ ఎత్తిపోతల పథకంపై చర్చ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతుండగా అడ్డుకునేందుకు మైకు లాక్కొనడానికి ప్రయత్నించడం అప్రజాస్వామికం.చట్టసభల్లో వైసీపీ నేతలు తీరు మార్చుకోవాలి. బిజెపి సభ్యుడుకి క్షమాపణ చెప్పాలి అని ముత్యాల బాబ్జి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు అన్నారు.

# కామనగరువులో అభివృద్ధికి శ్రీకారం

## రూ.20 లక్షలతో గణేష్ నగర్ అభివృద్ధి పనులు - సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ భూమిపూజ



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అమలాపురం పరిసర ప్రాంతమైన కామనగరువు పంచాయతీ పరిధిలో గణేష్ నగర్‌లో గ్రామాభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. గ్రామ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. మొత్తం రూ.20 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎమ్‌జిఎన్‌ఆర్‌ఈజిఎస్) నిధుల ద్వారా నిర్వహించబడుతున్నాయి. గ్రామంలోని గణేష్ నగర్ ప్రాంతంలో వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ ఉండటం, రోడ్లు దెబ్బతినడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ వెంటనే చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన అంచనాలు సిద్ధం చేయించి పనులను ఆమోదింపజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ గ్రామాభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామంలో ప్రాథమిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రజలకు అవసరమైన ప్రతి సదుపాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రోడ్లు, కాల్వలు వంటి మౌలిక వసతులు మెరుగుపడితే గ్రామ ఆరోగ్య పరిస్థితులు కూడా మెరుగుపడతాయని ఆమె పేర్కొన్నారు. రూ.20 లక్షలతో చేపడుతున్న ఈ పనుల్లో సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణం, పక్కన సక్రమమైన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరుగుతుంది. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. ప్రజల సౌకర్యం దృష్ట్యా పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆమె ఆదేశించారు. గ్రామ ప్రజలు కూడా ఈ అభివృద్ధి కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం దొరికిందని వారు తెలిపారు. గ్రామంలో సమగ్రాభివృద్ధి దిశగా సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు గుత్తుల నాగేంద్ర, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం ఎంతో అవసరమని, అందరూ కలిసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కామనగరువు పంచాయతీలో ప్రారంభమైన ఈ అభివృద్ధి పనులు త్వరలో పూర్తి అయి ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందిస్తాయని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జిల్లా వ్యాప్తంగా ముమ్మర వాహన తనిఖీలు

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గురువారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, పోలీసు సిబ్బంది ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేపట్టి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. వయస్సు నిండకముందే వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనం నడపడం పై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి, మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి జరిమానా విధించడంతో పాటు ప్రాణరక్షణలో హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా అతి వేగంగా వాహనాలు నడిపే వారిపై కూడా చర్యలు తీసుకున్నారు. కేవలం జరిమానాలు విధించడమే కాకుండా, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. రహదారి నిబంధనలు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రమాదాల కారణంగా కుటుంబాలు ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. ప్రజల రక్షణే మా ప్రాధాన్యత. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. ముఖ్యంగా యువత మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, హెల్మెట్ మరియు వాహన పత్రాలు కలిగి ఉండాలి అని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ హెచ్చరించారు.

## వాడపల్లి వెంకన్న నిత్య అన్న ప్రసాదానికి

# రూ.5 లక్షల విరాళం



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్రే యపుం మం డలం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వ హించే నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి గురువారం విజ యవాడ, ప్రసాదం పాడుకు చెందిన వెంకట దుర్గ స్టీల్స్ సంస్థకు చెందిన గంధం రాజేష్ కుమార్, దుర్గాదేవి దంపతులు రూ.5,00,001 విరాళంగా సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్న వారు అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధం రావుకు విరాళం అందించారు. ప్రత్యేక దర్శనం అనంతరం దాతలకు అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి చిత్ర పటం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు ప్రతిరోజూ నిర్వహిస్తున్న' అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి తమ వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) రాజు కృతజ్ఞతలు తెలియజేశారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వం

# గోడపత్రిక ఆవిష్కరించిన జనసేన నాయకులు



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్దనియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఆదేశాల మేరకు, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలు, అనుగుణంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ గోడ పత్రికను జనసేన నాయకులు ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూజనసేన ఉద్యమి సభ్యత్వం ప్రయోజనాలు గురించి వివరించారు.పార్టీ సభ్యునిగా అధికారిక గుర్తింపు ఏ గౌరవం పార్టీ కార్యక్రమాలలో ప్రాధాన్యత పార్టీ కమిటీలలో బాధ్యతలు పొందే అవకాశంసభ్యత్వం ఉన్నవారికే నాయకత్వ బాధ్యతలు.నాయకత్వ శిక్షణ. నాయకులుగా ఎదిగే అవకాశం ఐదు లక్షల ప్రమాద బీమా -మీ కుటుంబానికి భరోసా ఇప్పుడే మీ స్థానిక జనసేన సాధక్‌ను సంప్రదించి జనసేన కుటుంబంలో చేరండికొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపునకు స్పందించి సరికొత్త రాజకీయ వ్యవస్థలో భాగస్వాములు కావాలని వారు కోరారు ! ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్. నగరం ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి. జాలం శ్రీనివాసరాజా. గిడ్డి ఆనంద్. తాటికాయల శ్రీనివాస్.తాటికాయల వెంకటేష్. ఆదిమూలం సూర్యనారాయణ.తానంకి నాగరాజు. తుండూరు బుజ్జి. కొమ్ముల జంగమయ్య. మంద.గాంధీ. మద్దింశెట్టి బుజ్జి. పెనమరెడ్డి వెంకటరత్నం నాయుడు. షేక్ దొరబాబు. చిల్లి రమేష్. బొరుసుసూరిబాబు.అన్నబత్తుల కళ్యాణ్. అడ్డగల పండు. ఆదిమూలం కృష్ణ. యర్రం శెట్టిబుజ్జి. తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ విలువలతో కూడిన విద్య అందించాలి

## - చిలుకూరి రామ్ చరణ్ పిలుపు



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ :** ఏకల్ విద్యాలయం ఫౌండేషన్ లక్ష్యం భారత దేశంలోని మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని పిల్లలకు ప్రాథమిక విద్యను అందించే అతిపెద్ద విద్యా ఉద్యమం. "ఒక ఉపాధ్యాయుడు - ఒక పాఠశాల" అనే భావనతో, స్థానికంగా ఒకే ఉపాధ్యాయునితో చిన్న తరగతులు నిర్వహిస్తూ అక్షరాస్యత, ఆరోగ్యం, గ్రామీణ అభివృద్ధికి కృషి చేస్తుంది. ఇటువంటి విద్యాలయాల్లో ఉత్తమ విలువలతో కూడిన విద్యనూ అందించాలని కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ పిలుపును ఇచ్చారు. సుదూర గ్రామాల్లోని ప్రతి బిడ్డకు ప్రధానంగా 1-5 తరగతుల వారికి నాణ్యమైన ప్రాథమిక విద్యను అందుబాటులోకి తీసుకు రావడం, ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేని మారుమూల గ్రామాల్లో ఒకే ఉపాధ్యాయుడితో ఏక ఉపాధ్యాయ విధానంలో విద్యతో పాటు ఆరోగ్య విద్య, డిజిటల్ అక్షరాస్యత, మహిళా సాధికారత, స్థిరమైన వ్యవసాయంపై అవగాహన కల్పించే ఈ విద్యాలయాలు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి అన్నారు. జిల్లాలోని పిఠాపురం, ప్రత్తిపాడు ఏకల్ విద్యాలయాల సమూహంలోని ఉపాధ్యాయులకు పిఠాపురంలోని శివాలయం సమీపంలోని ఏకల్ విద్యాలయంలో ఏకరూపతా దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనికి సంస్థల ఆహ్వానం మేరకు చిలుకూరి రామ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులకు దుస్తులను పంచారు. అనంతరం సంస్థ సిబ్బందిని ఉద్దేశించి రామ్ కుమార్ ప్రసంగించారు. ఏకల్ విద్యాలయం ఫౌండేషన్ కేవలం పాఠశాల విద్యా బోధనకు మాత్రమే పరిమితం కాకుండా, గ్రామీణ భారత దేశంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న ఒక సామాజిక ఉద్యమాన్ని నిర్మిస్తోంది అన్నారు. ఇది ఒక స్వచ్ఛంద సంస్థ, ఇది గిరిజన గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి కట్టుబడి ఉంది. భారతదేశం, నేపాల్‌లోని వేలాది గ్రామాల్లో 50,000 కంటే ఎక్కువ పాఠశాలలను ఈ సంస్థ నిర్వహిస్తోందని సంస్థ నిర్మాణాన్ని, సంస్థ సేవలను రామ్ కుమార్ టూకీగా వివరించారు. ఇటువంటి ఉన్నత లక్ష్యాలతో కూడుకున్న ఉత్తమ సంస్థల్లో పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. విద్యతో పాటు హైందవ సంస్కృతి, నైతిక విలువలు కూడా విద్యార్థులకు నేర్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇటువంటి విద్యాలయాలకు మా వంటి వారి సహకారం, ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. సేవాభారతి సంస్థ రూపొందించిన అర్చన పుస్తకాలను, సాహిత్యాన్ని ఆచార్యులకు రాంకుమార్ బహూకరించారు. పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# రామకోటి పుస్తకాలు పంచిన రామ్ కుమార్



**రౌతులపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలంలోని గుమ్మరేగుల గ్రామంలోని హిందూ భక్త భజన మండలి సభ్యుల కోరిక మేరకు శ్రీరామకోటి రాసే సంకల్పాన్ని భక్తులు పూర్తి చేసేందుకు అవసరమైన పుస్తకాలను జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ బుధవారం రాత్రి అందజేశారు. అనంతరం ధారజగన్నాథపురం గ్రామంలోని శ్రీరామ, వినాయక ఆలయాలను సందర్శించారు. శ్రీరామ నగర సంకీర్తన చేసారు. అక్కడ ఉన్నటువంటి గ్రామ పార్టీ కార్యకర్తలతో, భక్తులతో శ్రీరామ మందిరంలో భజన చేసి ఆధ్యాత్మిక విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక కార్యకర్తలు, వివిధ భజన మండళ్ళ సభ్యులు పాల్గొన్నారు.

# సీతంపేటలో కారు కంటైనర్ లారీ ఢీ

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం పోలీసు స్టేషన్ పరిధిలోని సీతయమ్మపేట జాతీయ రహదారిపై కత్తిపూడి వైపు వస్తున్న కారు, కంటైనర్ లారీ బుధవారం సాయంత్రం ఒకదాని కొకటి పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. కొంతసేపు మాత్రం ప్రజా, వాహన రవాణాకు అంతరాయం కలిగింది. ప్రత్తిపాడు సిఐ. శ్రీహరిరాజు, అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు, పోలీసు సిబ్బంది వచ్చి ప్రజా రవాణాను యధావిధిగా పునరుద్ధరించారు. అనంతరం పోలీసుల బృందం కత్తిపూడి చేరుకుని పలు రవాణా వాహనాలను తనిఖీ చేసారు. ద్విచక్ర వాహనాలను నడుపుతున్న మైనర్లపై ప్రధానంగా దృష్టి సారించి ఈ తనిఖీలు చేశారు. మైనార్టీ తీరని వారిని నిలువరించారు.



# అనూరియా బాధితులకు మంత్రి దుర్గేష్ మనోధైర్యం

**కిమ్స్ ఆస్పత్రిలో బాధితులకు పరామర్శ - అండగా ఉంటామని హామీ - సంతోషం వ్యక్తం చేసిన బాధితులు**
**నిందితులపై కఠిన చర్యలు తప్పవు - బాధితులకు రూ. 10 లక్షల పరిహారం - మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో చికిత్స**
**రాజమహేంద్రవరంలో అధునాతన టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్తీ పాల ఘటన (అనూరియా) బాధితులను రాష్ట్ర సిని మాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం స్వయంగా పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి దుర్గేష్.. వెంటిలేటర్లపై ఉన్న వారికి ధైర్యం చెప్పారు. కన్నీరు మున్నీరవుతున్న బాధిత కుటుంబాలను ఓదార్చి, బాధితుల భుజం తట్టి, కరచాలనం చేసి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ కీలక అంశాలను వెల్లడించారు. ఈ ఘటన అత్యంత హృదయ విదారకం. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులతో సహా మొత్తం 15 మంది ఈ ప్రభావానికి లోనయ్యారు. ప్రస్తుతం 8 మంది బాధితులు చికిత్స పొందుతుండగా, అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ కోలుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా బాధితులకు రూ. 10 లక్షల పరిహారం ప్రకటించారు. వైద్యానికి అయ్యే ప్రతి పైసా ప్రభుత్వమే భరిస్తుంది అని తెలిపినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

**పత్యేక వైద్య బృందం - 'ఫోమి ఫీజోల్' డ్రగ్**

డాక్టర్ సుధాకర్ నేతృత్వంలో కిమ్స్ ఆస్పత్రిలో బాధితులకు మెరుగైన వైద్యం అందుతోంది. ఈ విభాగంలో నిపుణుడైన డాక్టర్ రవిరాజా పర్యవేక్షణలో బాధితులకు చికిత్స అందిస్తున్నాం. ఇటువంటి సమస్యలకు సమర్థవంతంగా పనిచేసే 'ఫోమి ఫీజోల్' అనే డ్రగ్ వాడకం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఎంతో చొరవ చూపి ఈ మెడిసిన్ అందుబాటులోకి తెప్పించారని మంత్రి దుర్గేష్ కొనియాడారు.

**కల్తీ రాయుళ్లకు మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరిక**

కల్తీకి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరినీ వదిలే ప్రసక్తి లేదు. ఇప్పటికే నమూనాలు సేకరించాం, నివేదికలు రాగానే బాధ్యులపై ఉక్కుపాదం మోపుతాం. వ్యాపారస్తులు ప్రజల ఆరోగ్యంతో ఆటలాడకూడదు, నిర్దేశిత ప్రమాణాలను పాటించాల్సిందే. నిబంధనలు అతిక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మంత్రి దుర్గేష్ హెచ్చరించారు.

**భవిష్యత్ ప్రణాళిక**

విశాఖలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందడం బాధాకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. పరీక్షల నిమిత్తం వేరే రాష్ట్రాలకు వెళ్లకుండా, రాజమహేంద్రవరంలోనే అత్యాధునిక టెస్టింగ్ సెంటర్ నెలకొల్పాలన్న విజ్ఞప్తిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తానని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ చెప్పారు.. ప్రజలు కూడా ఆహారం, పాలు, నీరు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సురక్షితమైన ఆహారాన్ని తీసుకోవాలని మంత్రి దుర్గేష్ సూచించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# భక్తి శ్రద్ధలతో భరతమాత పూజ



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కాజులూరు మండలం(యానాం ఖండ) గొల్లపాలెం గ్రామంలో భారతమాత పూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శీలమంతుల వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి పెమ్మరాజు సత్యరామచంద్రరావు(గోదావరి విభాగ్ కుటుంబ ప్రభోధన్ సంయోజక్) వక్తగా వ్యవహారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో అందరు కలిసి భోజనం చేయాలని, కలిసి భజన చేయాలని, మన ఇల్లు ఒక ప్రశాంత , ప్రేమ పూర్వక కంగా ఉండాలని సూచించారు. త్వరలో రానున్న ఉగాదికి ఇంటి ముందు ఉగాదికీ అరంభం పలుకుతూ, అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ అందరితో ఆనందం పంచుకునే సాంప్రదాయాన్ని పునఃప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ రఘు, పొతుల వీరబాబు, అంగర కృష్ణ, అనురాధ పద్మ, తేజ పార్వతి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

# బంగారం / బ్యాంక్ ఎఫ్‌డి : సామాన్యులకు ఏది బెస్ట్.?

## డబ్బు డబుల్ చేసే సత్తా ఎందులో ఉందంటే..!

ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా.. ఏ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగినా.. దాని ప్రభావం నేరుగా మీ జేబుపై పడుతుందని మీకు తెలుసా? గ్లోబల్ మార్కెట్లు కుదేలైనప్పుడు ఇన్వెస్టర్లందరికీ కనిపించే ఒకే ఒక్క సురక్షిత తీరం బంగారం. అయితే మనలో చాలా మందికి ఇప్పటికీ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడమే మంచిదని అనుకుంటారు. ఈ రెండిటి మధ్య తేడాలు తెలుసుకుందాం.. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగినప్పుడల్లా, మార్కెట్లు కుప్పకూలుతుంటాయి. కానీ అలాంటి సమయంలోనూ ఎదురులేకుండా దూసుకుపోయేది కేవలం బంగారం మాత్రమే. అందుకే యుద్ధ మేఘాలు కమ్ముకున్నా, ఆర్థిక సంక్షోభం వచ్చినా ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా బంగారాన్ని నమ్ముకుంటారు. మరి ఈ తరుణంలో సామాన్యులు తమ పొదుపు మొత్తాన్ని గోల్డ్‌లో పెట్టాలా? లేక సాంప్రదాయ బ్యాంక్ ఎఫ్‌డిలలో ఉంచాలా? ఏది సురక్షితమో ఇప్పుడు తెలుసుకుందాం..

**కాలంతో పాటు మారుతున్న పెట్టుబడి పద్ధతులు**

ఒకప్పుడు సామాన్యులకు పెట్టుబడి అంటే కేవలం బ్యాంక్ ఖీణలు లేదా పోస్ట్ ఆఫీస్ పథకాలు మాత్రమే. కానీ ఇప్పుడు కాలం మారింది. నేటి ఇన్వెస్టర్లు స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్, బాండ్లతో పాటు బంగారం, వెండి వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా అనిశ్చిత పరిస్థితుల్లో బంగారం ధరలు ఆకాశాన్ని




తాకుతుండటంతో దీనిపై ఆసక్తి పెరుగుతోంది.

**బంగారం**

బంగారం ఎప్పుడూ స్థిరమైన రాబడిని ఇస్తుందని చెప్పలేం కానీ దీర్ఘకాలంలో ఇది భారీ లాభాలను అందిస్తుంది. కరెన్సీ విలువ తగ్గుతున్నప్పుడు బంగారం విలువ పెరుగుతుంది. అత్యవసర సమయంలో బంగారాన్ని ఎప్పుడైనా, ఎక్కడైనా నగదుగా మార్చుకోవచ్చు.

**బ్యాంక్ ఎఫ్‌డి..**

చాలా మంది భారతీయులు ఇప్పటికీ బ్యాంక్ ఎఫ్‌డినే అత్యంత సురక్షితమైనదిగా భావిస్తారు. ఇందులో మీరు పెట్టిన పెట్టుబడికి 7 రోజుల నుండి 10 ఏళ్ల వరకు నిర్ణీత కాల వ్యవధిలో గ్యారెంటీ వడ్డీ లభిస్తుంది. మీ బ్యాంక్ ఏదైనా కారణం వల్ల దివాలా తీస్తే.. భారత ప్రభుత్వం కేవలం రూ.5 లక్షల వరకు మాత్రమే బీమా కవరేజీ ఇస్తుంది. అంటే మీరు బ్యాంకులో రూ.50 లక్షలు డిపాజిట్ చేసినా, బ్యాంక్ మునిగిపోతే మీకు వచ్చేది కేవలం రూ.5 లక్షలు మాత్రమే.

**ఏది బెస్ట్..?**

తక్కువ రిస్క్ తో గ్యారెంటీ రాబడి కావాలనుకుంటే బ్యాంక్ ఖీణ మేలు. దీర్ఘకాలిక దృష్టితో పెట్టుబడి పెట్టేవారికి బంగారం అత్యుత్తమ ఎంపిక.

# అతి తక్కువ పెట్టుబడి..

## ఎప్పటికీ డిమాండ్ తగ్గని బిజినెస్!



రూ.2 లక్షల చిన్న పెట్టుబడితో ఫుడ్ బిజినెస్ ప్రారంభించడం సాధ్యమే. సరైన ప్రణాళికతో టిఫిన్ సెంటర్, బ్రేక్‌ఫాస్ట్ పాయింట్ వంటివి మొదలుపెట్టి, రోజుకు రూ.800-రూ.1500 లాభం పొందవచ్చు. పరిశుభ్రత, రుచి, సరసమైన ధరలతో కస్టమర్లను ఆకర్షించి, ఆన్‌లైన్ డెలివరీ ద్వారా ఆదాయం పెంచుకోవచ్చు. ఎప్పటికీ డిమాండ్ తగ్గని బిజినెస్ ఏదైనా ఉందా అంటే అది ఫుడ్ బిజినెస్. ఈ క్రమంలోనే చిన్న పెట్టుబడితో స్వంత వ్యాపారం ప్రారంభించాలని భావించే యువతలో ఫుడ్ రంగంపై ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా రూ.2 లక్షల పెట్టుబడితో హోటల్ లేదా టిఫిన్ సెంటర్ మొదలు పెట్టొచ్చా అనే డౌట్ చాలా మందికి ఉంటుంది. వ్యాపార నిపుణుల ప్రకారం సరైన ప్రణాళిక ఉంటే చిన్న స్థాయిలో ఈ బిజినెస్ ప్రారంభించడం సాధ్యమే. రూ.2 లక్షల బడ్జెట్‌తో పెద్ద రెస్టారెంట్ ప్రారంభించడం కష్టం అయినప్పటికీ చిన్న టిఫిన్ సెంటర్, బ్రేక్‌ఫాస్ట్ పాయింట్, టీ-స్నాక్స్ స్టాల్ వంటి మోడళ్లతో మొదలు పెట్టవచ్చు. అద్దె తక్కువగా ఉన్న ప్రాంతం ఎంచుకుంటే పెట్టుబడి నియంత్రణలో ఉంటుంది. స్టౌ, గ్యాస్, పాత్రలు, టేబుళ్లు, కుర్చీలు, ముడి సరుకు కోసం ప్రారంభ ఖర్చు సాధారణంగా ఈ బడ్జెట్‌లోనే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. లాభాల విషయానికి వస్తే ఇది పూర్తిగా లొకేషన్, కస్టమర్ రద్దీ, ధరల వ్యూహం మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు రోజుకు 100 నుంచి 150 ప్లేట్లు టిఫిన్ లేదా స్నాక్స్ అమ్మగలిగితే సగటున రూ.3,000 నుంచి రూ.6,000 వరకు రోజువారీ టర్నోవర్ సాధ్యమవుతుంది. ఖర్చులు తీసేసిన తర్వాత రోజుకు సుమారు రూ.800 నుంచి రూ.1,500 వరకు నికర లాభం రావచ్చని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే పరిశుభ్రత, రుచికరమైన ఆహారం, స్థిరమైన నాణ్యత, సరైన ధరలు ఉంటే కస్టమర్లు త్వరగా పెరుగుతారని నిపుణులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్ డెలివరీ యాప్‌లలో నమోదు చేసుకుంటే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. మొత్తానికి రూ.2 లక్షలతో చిన్న స్థాయి హోటల్ బిజినెస్ ప్రారంభించడం సాధ్యమే. అయితే పెద్ద లాభాలు వెంటనే ఆశించకుండా, స్థిరంగా కస్టమర్ బేస్ పెంచుకుంటూ ముందుకు సాగితే ఈ రంగంలో మంచి ఆదాయం పొందే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# నేడు కోరుకొండ స్వయంభు నరసన్న రథోత్సవం

## - నరసన్న కళ్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవాలు గురువారం సాయంత్రం పుట్ట మన్ను, ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామి వారి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు స్వామి అమ్మవార్లను పెండ్లి కొడుకు, పెండ్లి కూతురుగా సర్వాంగ సుందరంగా అలంకరించి రథంపై మధ్యాహ్నం 1.54 నిమిషాలకు అశేష భక్తుల నరసన్న నామస్మనాలతో, మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు, కోలాటాలు, గరగ నృత్యాలు, శక్తి వేషాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో స్వామివారి "రథోత్సవం" అంగరంగ వైభవంగా జరగనుంది. సాయంత్రం వైఖానస ఆగమ సాగమపండితులు శ్రీమాన్ పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్పి రంగరాజ బట్టర్ ఆధ్వర్యంలో వంశపారంపర్య అర్చకులు పెదపాటి పెద్దింటి పెరవలి పర్యవేక్షణలో స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరగడానికి అన్నవరం దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థిర వారం రాత్రి ఎనిమిది గంటలకు స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 7 గంటలకు ఆలయ ముఖ మండపంలో వేద పండితులు, ఉభయ వేదాంత పండితుల సమక్షంలో "సదస్యం" జరగనుంది. రాత్రి 9 గంటలకు స్వామివారిని ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. సోమవారం రాత్రి 8 గంటలకు శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో "శ్రీ రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవం" ఘనంగా జరగనుంది. 9గంటలకు స్వామివారిని గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. జయవారం ఉదయం ఎనిమిది గంటలకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని, చక్ర పెరుమాళ్లో స్వామివారిని చేరొ పల్లకిలపై "గిరి ప్రదక్షణ" గావించి, పాప నాసిని వద్ద చక్రతీర్థం ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం "ఉంజాల్ సేవ" లో భాగంగా స్వామి అమ్మవార్లను అద్దంలో దర్శనం చేయింపచేయనున్నారు. అనంతరం తొమ్మిది గంటలకు స్వామివారిని "శేష వాహనం"పై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. బుధవారం రాత్రి స్వామి అమ్మ వార్లను "ద్వాదశ ప్రదక్షిణలు" గావించి, "శ్రీ పుష్పయాగం" నిర్వహించనున్నారు.

**పంతులు సత్రంలో అన్నదానం:** శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవాలు తిలకించడానికి విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం, రాత్రి రెడ్డి పంతులు సత్రంలో ఐదు రోజులపాటు అన్నదానం నిర్వహించనున్నారు. స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానున్నారు. భక్తులను దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు.

# తల్లిదండ్రులు జ్ఞాపకార్థం అన్న ప్రసాద వితరణ : ఉమాపార్వతీశం సరిత



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కోరుకొండ శ్రీ ద్వారక మాయి షిరిడి సాయిబాబా ఆలయంలో అన్న వితరణ చేస్తున్నట్లు యెజ్జు ఉమాపార్వతీశం సరిత దంపతులు తెలిపారు. గురువారం ఉమాపార్వతీశం సరిత దంపతులు సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్ని దానములు కన్నా అన్న దానము మిన్న అని, అన్న ప్రసాద వితరణ చేయడం పూర్వజన్మ సుకృతంగా బావిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు.గ్రామాల్లో ఉన్న ప్రతీ దేవాలయంలో ఆర్థికంగా వెసులుబాటు ఉన్న మేరకు ప్రతి దైవ కార్యక్రమంలో పాలు పంచుకొని హిందూ దేవాలయాల అభ్యున్నతికి పాటు పడాల ని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అన్ని జీవుల్లో తను నమ్ముకున్న దేవుడుని చూసినపుడు, ప్రేమను పంచినపుడు సమాజం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మండపేట రానున్న కాశీ పీఠాధిపతులు శివ నాగేంద్ర సరస్వతి



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వారణాసికి చెందిన ప్రముఖ కాశీ పీఠాధిపతులు శ్రీ శివ నాగేంద్ర సరస్వతి స్వామీజీ మార్చి 1 న మండపేట విచ్చేస్తున్నట్లు మండపేట 15 వ వార్డు కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. మార్చి 1 నుండి 5 వరకు మండపేట ధర్మ గుండం చెరువు వద్ద గల శ్రీ రాజరాజేశ్వరి పీఠం వద్ద ఉంటారని తెలిపారు. 5 రోజులు పాటు స్వామి వారు మండపేట లోనే ఉంటూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. మార్చి 1 ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కలువపువ్వు సెంటర్ నుండి ఊరేగింపుగా స్వామి వారిని పీఠానికి తీసుకు వెళతామని చెప్పారు. స్వామి వారు అమ్మ వారి మహానుగ్రహం కలిగిన మహోన్నతులని పేర్కొన్నారు. అమ్మ వారి భక్తులు, కుల మతాలకు అతీతంగా పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారి ఊరేగింపును విజయవంతం చేయాలని శ్రీనివాస్ కోరారు.

# ఎరువులు పురుగుల మందుల అమ్మకాలలో నియమాలు పాటించాలి

## వ్యవసాయ సంచాలకులు డి.శ్రీనివాస్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల నూతన సహాయ వ్యవసాయ సంచాలకులు డి.శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి గౌరీ దేవి ఆధ్వర్యంలో ఎరువులు మరియు పురుగుమందుల షాపులు తనిఖీ చేయడం జరిగింది. మరియు మధ్యాహ్నం నుండి మండలములో ఉన్న ఎరువుల దుకాణదారులకు మీటింగ్ ఏర్పాటు చేసి ఎరువులు పురుగుమందుల అమ్మకాల్లో పాటించవలసిన నియమాలు తెలియజేయడం జరిగింది. ఎ టువంటి కల్తీ విత్తనాలు కానీ సిఫార్సులేని బయోమందులు కానీ అమ్మ కూడదని ఏ విధమైన పురుగు మందులు, సూక్ష్మ పోషకాలు కానీ లింకు పెట్టి అమ్మకూడదని తెలియజేశారు.

# పాల కేంద్రాలకు హెచ్చరికలు జారీ

## నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు : శానిటేషన్ ఇన్స్పెక్టర్ సత్తిరాజు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ టీవీ రంగారావు ఆదేశాల మేరకు గురువారం 16 పాలకేంద్రాలలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఆయా కేంద్రాల వద్ద పాల ఉత్పత్తుల నాణ్యతను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా శానిటేషన్ ఇన్స్పెక్టర్ సత్తిరాజు మాట్లాడుతూ పాలు విక్రయించే పాల కేంద్రాల నిర్వహకులు ఖచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పాలధిన్ కవర్లలో ప్యాకింగ్ చేయరాదని ఎటువంటి పాల ఉత్పత్తులు కేంద్రాలలో నిల్వ ఉంచరాదని , కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేవిదంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. బాధ్యత రాహిత్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఆయన వెంట సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలి

## రాయల్ మసీదులో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆ అల్లా ఆశీసులు అందరిపై ఉండాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మెయిన్ రోడ్డులో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న రాయల్ మసీదులో జరిగిన ఇఫ్తార్ విందుకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, అల్ సమి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లా, మసీదు కమిటీ సభ్యులు తదితరులతో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరిగిన ముస్లింల మతపరమైన ప్రార్థనల్లో పాల్గొని అనంతరం ఇఫ్తార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల అభివృద్ధి కేవలం కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు. అన్ని మతాలను ఏకం చేసేదే ఈ పవిత్రమైన ఇఫ్తార్ విందు అని అన్నారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసం, ప్రార్థనలు మనల్ని ఆత్మవిశ్వాసం, కరుణ, సోదరత్వం వైపు నడిపిస్తాయన్నారు. రంజాన్ మనకు బోధించే సత్యం ఏమిటంటే... మనం అందరూ ఒకే దేవుని సృష్టులం, భగవంతుని మార్గంలో ఐక్యంగా నడవాలని సూచిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఈ సోదరత్వాన్ని పెంచుతోందని, మతం, కులం, మతపరమైన విభేదాలను మరచి, పేదలు, రైతులు, యువత, మహిళల అభివృద్ధికి కృషి చేస్తుస్తోందన్నారు. ఈ రంజాన్ రాష్ట్రంలో శాంతి, సమృద్ధి, ఐక్యతను తీసుకువస్తుందని నమ్ముతున్నామన్నారు. తన సోదరులైన ముస్లిం మైనారిటీలంతా ఆరోగ్యం, సుఖశాంతులతో జీవించాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాననని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కాగా నగరంలోని పలు మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్టు తెలిపారు. నగరంలోని మసీదులు, షాధి ఖానాలకు, ముస్లిం బరియల్కు ఇప్పటికే కమిటీలు నియమించినట్టు తెలిపారు. వక్ఫ ఆస్తులను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. అన్ని విషయాల్లోనూ ముస్లింలతో కలిసి ముందుకు నడుస్తామని, వారికి అండగా ఉంటామన్నారు. మత సామరస్యాన్ని కాపాడటమే కాకుండా అన్ని విధాలుగా ముస్లిం మైనారిటీలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేసింది ఒక్క తెలుగుదేశం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రారంభమైన

# పాత సోమాలమ్మ జాతర మహోత్సవాలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని గాంధిపురం-3లో వేంచేసివున్న పాత సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున 4గంటలకు అమ్మవారికి పంచామృత అభిషేకం చేశారు. ఉదయం 10.10గంటలకు కలశ స్థాపన,10.30 గంటలకు లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చంద్రమౌళి గణేష్ శర్మ మాట్లాడుతూ ఫాల్గుణ శుద్ధ దశమిని పురస్కరించుకుని ఆలయ అనువంశిక ధర్మకర్త గొర్రెల సురేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నామని,వచ్చే నెల 2వ తేదీవరకు జరుగుతాయని చెప్పారు. రాజమండ్రి నగర గ్రామ దేవత సోమాలమ్మ అమ్మవారని,తరతరాలుగా ఫాల్గుణ శుద్ధ దశమిని పురస్కరించుకుని అమ్మవారికి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజల రక్షణకుఅమ్మవారు నగరంలో నిత్యం సంచరిస్తూ ప్రదక్షిణలు చేస్తారని, కోరిన కోర్కెలు తీర్చే తల్లి అని భక్తుల నమ్మకమని చంద్రమౌళి గణేష్ శర్మ చెప్పారు. జాతర మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మవారికి కుంకుమ పూజలు జరుగుతాయని తెలిపారు.అలాగే ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారని ఆయన వివరించారు.27వ తేదీ ఉదయం 8 గంటలకు చండీహోమం, 28న ఉదయం 8.30 గంటలకు లక్షపుష్పార్చన, మార్చి1వ తేదీ ఉదయం 9 గంటలకు సౌభాగ్య వ్రతం, సాయంత్రం అమ్మవారి పల్లకిసేవ, ఊయలసేవ, 2వ తేదీ తెల్లవారుజాము 4 గంటలకు పంచామృత అభిషేకం జరుగుతాయని వివరించారు.

# ఆదిత్య విద్యార్థిని కోటప్పకొండ ట్రైనింగ్‌కు ఎంపిక




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆదిత్య స్కూల్ ఆఫ్ యానిమేషన్ ఎన్ఎస్ఎస్ మరియు ఇండియన్ యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ కర్రి మేఘన కోటప్ప కొండ ట్రయినింగ్ కు ఎంపిక అయింది అని రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి చెప్పారు.మూడు రోజులపాటు ఫస్ట్ ఎయిడ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ వంటి అనేక విషయాలను నేర్చుకోవడానికి డా. మహాలక్ష్మితో పాటు ఎస్కేవిటీ కళాశాల వాలంటీర్ కూడా వెళ్లినట్లుగా ఆయన ఒక సందర్భంలో చెప్పారు. ఆదిత్య స్కూల్ ఆఫ్ యానిమేషన్ ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్ తమ విద్యార్థులు మొన్న పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయంలో మాతృభాషా దినోత్సవం న, వ్యాసరచన పోటీలో అత్యధిక బహుమతులు ధ్రువపత్రాలు సాధించారని, నేడు రెడ్ క్రాస్ కు ఎంపికై తమ కీర్తిని రెండింతలు చేశారని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి తమ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.ఆదిత్య విద్యాసంస్థల ఎన్.ఎస్.ఎస్. డీన్, ఎన్ఎస్ఎస్పిఓడరెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. వి.ఎస్.నాగేశ్వరరావు, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. పి.ఓ, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి హెచ్ వి.రమాదేవి, ఎన్ఎస్ఎస్. పి.ఓ లు బేటి విమల,పోలుకొండ సాయిలు తమ అభినందనలు తెలియజేశారు.

### సోము వీర్రాజుపై వైకాపా ఎమ్మెల్సీలు

# దురుసు ప్రవర్తనను ఖండిస్తున్నాం

## అపార అనుభవం కలిగిన వ్యక్తి సోము : బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కిన నాగేంద్ర



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో బిజెపి ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజుపై వైసిపి ఎమ్మెల్సీలు ఇజ్రాయెల్, విక్రాంత్, రమేష్ యాదవ్ దురుసు ప్రవర్తనను బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కిన నాగేంద్ర ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పిక్కిన నాగేంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు ఎమ్మెల్సీ బిజెపి ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజుని మాట్లాడాలని అనుమతిచ్చిన సందర్భంలో సోము వీర్రాజు మాట్లాడే ప్రయత్నం చేస్తున్న సమయంలో వైసీపీ ఎమ్మెల్సీలు దుందుడుకుగా దురుసుగా సోము వీర్రాజుపై దాడి చేయాలని మీదకు రావడం సబబు కాదు. సోము వీర్రాజు బిజెపి తరుపున 48 సంత్సరాల నుంచి రాజకీయ క్షేత్రంలో పని చేస్తున్నారు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులుగా పని చేశారు. అలాంటి సీనియర్ నాయకుడుపై అకారణంగా దురుసుగా ప్రవర్తించడం వైసీపీ ఎమ్మెల్సీలకు తగదని.. వెంటనే ఆ ముగ్గురు ఎమ్మెల్సీలు సోము వీర్రాజుకి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. అలానే వైసీపీ అధినేత జగన్ ఈ ఘటనపై స్పందించి ఆ ముగ్గురు ఎమ్మెల్సీ లను మందలించాలని కోరుతున్నాను. క్షమాపణలు చెప్పని పక్షంలో బిజెపి నాయకుల ప్రతిస్పందనకు వైసీపీ బాధ్యత వహించాల్సివస్తుందని తెలియజేస్తున్నాను అని జిల్లా అధ్యక్షుడు పిక్కిన నాగేంద్ర హెచ్చరించారు. బీజేపీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు తగరం సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# కోడికిషోర్‌కు మదర్ థెరిసా సేవా సమితి సత్కారం

## - ఆర్.టి.ఐ జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ(డిఎల్‌సిసి) సభ్యుడిగా నియామకం
## - వ్యవస్థాపకులు ఉందుర్తి సుబ్బారావు



**రంగంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక దినపత్రిక ప్రతినిధిగా సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ప్రముఖ సామాజిక వేత్త, మంచి మనిషి,రాజానగరం మండలానికి చెందిన కోడి తాతారావు అలియాస్ కిషోర్‌ను 2026-2027 సంవత్సరమునకు గాను ఆర్టిఐ జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ (డి ఎల్ సి సి) సభ్యునిగా ఎంపిక చేసిన తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తికి మదర్ తెరిసా సేవా సమితి తరపున వ్యవస్థాపకులు ఉందుర్తి సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా కలెక్టర్ కోఆర్డినేషన్ ఆఫీసర్ గాను, జిల్లా రెవెన్యూ అధికారి నోడల్ అధికారి గాను మరో ఇద్దరు నామినేటెడ్ సభ్యులు గల డీఎల్సీసీ కి సామాజిక స్పృహ కలిగిన కిషోర్ ని ఎంపిక చేయడం మంచి పరిణామం అని అన్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ దాదాపు మూడు దశాబ్దాలుగా ఎస్సీ ,బీసీ, మైనార్టీ వర్గాలకు విశేషమైన సేవలు అందిస్తున్న కోడి కిషోర్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. డి ఎల్ సి సి సభ్యునిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా రంగంపేట మండలంలో పర్యటించిన కోడి కిషోర్ని మదర్ తెరిసా సేవాసమితి ప్రతినిధులు వడిశలేరు గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి చిరు సత్కారాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సేవాసమితి వ్యవస్థాపకులు ఉందుర్తి సుబ్బారావు కిషోర్ సేవలను కొనియాడారు. భవిష్యత్తులో పేద బలహీన వర్గాల వారికి మరియు సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మదర్ తెరిసా సేవా సమితి అధ్యక్షురాలు కొల్లి సంధ్యా నీలిమ సేవాసమితి ప్రతినిధులు పల్లెటి రాజేశ్వరరావు, బత్తిన తాతారావు, కోరుమిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# 28న బిక్కవోలు శ్రీప్రజ్ఞ డీగ్రీ కళాశాలలో జాబ్ మేళా

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు
## జిల్లా ఉపాధి అధికారి కే.హరీష్ చంద్ర ప్రసాద్ - జిల్లా నైపుణ్యాధికారి విడిజీ మురళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనపర్తి నియోజకవర్గంలోని బిక్కవోలు లోని శ్రీ ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.హరీష్ చంద్ర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో రాజేంద్ర ఎనర్జీ సొల్యూషన్, టీమ్ లీజ్, ఇన్నోవా సోర్స్ తదితర కంపెనీలలో పోస్టుల భర్తీ కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.10వ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, అనుభవం ఉన్న లేదా ఉద్యోగం చేయడానికి ఆశక్తి గల 19 నుండి 30సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ రెజ్యూమే, ఆధార్, సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు.మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్, జిల్లా నైపుణ్యాదికారి విడి జీ.మురళిలు తెలిపారు.

# కొడవ సంప్రదాయంలో రష్మిక విజయ్ పెళ్లి..



టాలీవుడ్ లవ్ బర్డ్స్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. గురువారం ఉదయం తెలుగు సంప్రదాయంలో వీరిద్దరి పెళ్లి వేడుక ఘనంగా జరిగింది. అనంతరం రష్మిక టీమ్ మెంబర్స్ స్థానికులకు స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. ఇక సాయంత్రం వీరిద్దరి వివాహం కొడవ పద్ధతిలో జరగనుంది. ఇంతకీ ఈ కొడవ అంటే ఏంటో తెలుసా.. ? టాలీవుల్ లవ్ బర్డ్స్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. వీరిద్దరి వివాహం గురువారం ఉదయం ఉదయ్ పూర్ లోని ఐటీసీ హోటల్లో జరిగింది. ఈ పెళ్లికి సినీప్రముఖులు, సన్నిహితులు హాజరైనట్లు సమాచారం. ఈ పెళ్లికి పూర్తి ప్రైవసీగా నో ఫోన్ పాలసీని సైతం అమలు చేశారు. ఇక మార్చి 4న హైదరాబాద్ లోని తాజ్ కృష్ణలో సినీ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. ఇదిలా ఉంటే.. గురువార రష్మిక, విజయ్ మరోసారి పెళ్లి చేసుకోబోతున్నారు. ఉదయం తెలుగు సంప్రదాయంలో వివాహం జరగ్గా.. సాయంత్రం కర్ణాటకలోని కొడవ పద్ధతిలో పెళ్లి చేసుకోకున్నారు. కర్ణాటకలోని కొడగు (కూర్గ్ ) జిల్లాలో జన్మించింది రష్మిక. అక్కడి స్థానిక వారియర్ కమ్యూనిటీనే కొడవగా పిలుస్తారు. ఈ వర్గానికి చెందిన ప్రజల ఇళ్లల్లో పెళ్లిళ్లు ఎలా జరుగుతాయో తెలుసా ? అని సోషల్ మీడియాలో తెగ సెర్చ్ చేస్తున్నారు నెటిజన్స్. కొడవ ప్రజల సంస్కృతి, ఆహార్యం, వివాహ పద్ధతులు ఇతరులతో పోలిస్తే విలక్షణంగా ఉంటాయి. యువతీయువకులు తమ వర్గ సంప్రదాయాలు పాటిస్తూ పూర్వీకులను గౌరవిస్తూ పెళ్లి చేసుకుంటారు. మామూలుగా జరిగే హిందూ వివాహాలకు భిన్నంగా కొడవ వెడ్డింగ్ ఉంటుంది. అగ్నిసాక్షిగా ఏడడుగులు నడుస్తూ ప్రమాణాలు చేసుకోవడం వంటిది ఏమీ ఉండదు. సుదీర్ఘంగా పెళ్లి మంత్రాలు వినిపించావు. ఈ ప్రక్రియ మొత్తంలో స్థానికతే కనిపిస్తుంది. అరటి ఆకుల్లో విందు, సంప్రదాయ అలంకరణలు ఈ ప్రత్యేక ఆకర్ణగా నిలిచాయి. ఈ వేడుకలో కుప్పస దుస్తులు, తలపాగ ధరించనున్నారు. యోధ సంప్రదాయానికి చిహ్నంగా పీచే కట్టి అనే కత్తి ధరించడం ముఖ్య ఆచారం. వధువు కోర్గి శైలిలో చీర కట్టడం ప్రత్యేక ఆకర్షణంగా నిలుస్తుంది. కొవడ మహిళలు తమ పైటకొంగును వెనక నుంచి ముందుకు వేస్తారు. ఇక వేడుక అంతా వలగ డ్రమ్ బీట్స్, పాటలతో వారియర్ నేపథ్యాన్ని గుర్తుచేసే నృత్యాలతో ఎలాంటి ఆర్భాటం లేకుండా సందడిగా సాగుతుంది. అలాగే గన్ సెల్యూట్స్ కూడా ఆ వేడుకలో భాగమే. అయితే ఇప్పుడు దానిని అనుసరించడం క్రమంగా తగ్గిపోతుంది. ఈ క్రమంలోనే గతంలో కొడవ పద్ధతిలో రష్మిక మంట్లాడిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరలవుతుంది.



సినీ వాయిస్ CINEMA

# టాలీవుడ్‌లో నవశకం..

## కంటెంట్‌తో కదం తొక్కుతున్న యువ నిర్మాతలు..!

తెలుగు సినీ పరిశ్రమలో యువ నిర్మాతలు కొత్త కంటెంట్‌తో తమ సత్తా చాటుతున్నారు. యువ నిర్మాతల్లో మెగా డాటర్ నిహారిక కొణిదెల ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఆమె స్థాపించిన 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' పదేళ్లు పూర్తి చేసుకుంది. 'ముద్దపప్పు ఆవకాయ్' వెబ్ సిరీస్ నుంచి 'కమిటీ కుర్రోళ్లు' వరకు సాధించిన విజయాలు ఆమె జర్నీని మరింత ఇన్‌స్పైరింగ్‌గా నిలబెట్టాయి. ఆమెలానే మరికొందరు యంగ్ ప్రొడ్యూసర్లు టాలీవుడ్‌లో జెండా పాతేస్తున్నారు. తెలుగు ఇండస్ట్రీలో యువ నిర్మాతల జోరు స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం పెట్టుబడులు పెట్టడమే కాకుండా.. కంటెంట్ సెలెక్షన్‌లోనూ కొత్త పుంతలు తొక్కుతూ ఇండస్ట్రీ రూపురేఖలను మార్చేస్తున్నారు. ముఖ్యంగా మెగా డాటర్ నిహారిక కొణిదెల ప్రొడ్యూసర్‌గా తనదైన ముద్ర వేస్తున్నారు. ఆమె స్థాపించిన 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె జర్నీని చూస్తే ఎంతో ఇన్‌స్పైరింగ్‌గా అనిపిస్తుంది. 'ముద్దపప్పు ఆవకాయ్' వెబ్ సిరీస్‌తో బ్లాక్‌బస్టర్ అందుకున్న నిహారిక.. గతేడాది 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో భారీ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ సాగుతున్న ఆమె పదేళ్ల ప్రయాణం.. ఇప్పుడు సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్న 'రాకాస' సినిమా నిర్మాణంతో మరింత వేగంగా ముందుకు సాగుతోంది. నెక్ట్స్ అన్నయ్య వరుణ్ తేజ్‌తోనే ఓ సినిమా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇక మరో యువ నిర్మాత వంశీ నందిపాటి దూకుడు కూడా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం సినిమాలు నిర్మించడమే కాకుండా.. కంటెంట్ ఉన్న సినిమాలను పంపిణీ చేస్తూ తన సత్తా చాటుతున్నాడు. ముఖ్యంగా బన్నీ వాస్‌తో చేతులు కలిపి గత ఆర్నెళ్లలోనే ఏకంగా 6 సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం విశేషం. 'రాజు వెడ్స్ రాంభాయ్', 'లిటిల్ హార్ట్స్', 'ఈషా', 'మిత్రమండలి', 'శ్రీ చిదంబరం గారు', 'హే బలవంత్' వంటి డిఫరెంట్ కాన్సెప్ట్ చిత్రాలను విడుదల చేసి సక్సెస్‌ఫుల్ డిస్ట్రిబ్యూటర్ కమ్ ప్రొడ్యూసర్‌గా ఎదిగాడు. ఈ జోరును కొనసాగిస్తూనే.. మార్చి 6న 'సంప్రదాయని సుప్పిని సుద్దపూసని' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఉన్న మరో సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. టాలీవుడ్‌కు వరస హిట్లు ఇస్తున్న మరో ఇద్దరు క్రేజీ ప్రొడ్యూసర్లు సాహు గారపాటి, నిరంజన్ రెడ్డి. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి వరుసగా క్రేజీ ప్రాజెక్టులను నిర్మిస్తూ అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకున్నాడు. మొన్నటికి మొన్న 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాతో అదిరిపోయే బ్లాక్‌బస్టర్ కొట్టి ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. మరోవైపు ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నిరంజన్ రెడ్డి 'హనుమాన్' సినిమాతో ఏకంగా ప్యాన్ ఇండియా స్థాయిలో సెన్సేషనల్ సక్సెస్ క్రియేట్ చేశాడు. ఆ సినిమా ఇచ్చిన ఊపుతో ఇప్పుడు ఏమాత్రం కాంప్రమైజ్ కాకుండా 'సంబరాల ఏటిగట్టు' అనే మరో విభిన్నమైన కథను నిర్మిస్తూ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే పనిలో బిజీగా ఉన్నాడు.

క్రీడా వాయిస్

# టీమిండియాకు గుడ్ న్యూస్..

## సెమీస్ రోడ్ మ్యాప్ రెడీ చేసిన సౌతాఫ్రికా..?



సౌతాఫ్రికా వర్సెస్ వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతోన్న కీలక పోరుతో భారత జట్టుకు శుభవార్త అందుతోంది. సౌతాఫ్రికా బౌలర్ల దెబ్బకు విండీస్ టీం వరుసగా వికెట్లు కోల్పోతూ, స్వల్ప స్కోర్ కే ఆలౌట్ అయ్యేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం విండీస్ టీం 10 ఓవర్లలోపే 7 వికెట్లు కోల్పోయింది. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 గ్రూప్-1లో అగ్రస్థానాల్లో ఉన్న వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు గురువారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో తలపడుతున్నాయి. ఈ మ్యాచ్ ఫలితం నేరుగా భారత్ సెమీఫైనల్ భవితవ్యాన్ని ప్రభావితం చేసే కీలక పోరుగా మారింది. ఈ క్రమంలోనే సౌతాఫ్రికా బౌలర్లు టీమిండియాకు బూస్ట్ ఇచ్చేలా బౌలింగ్ చేస్తున్నారు. వార్త రాసే సమయానికి వెస్టిండీస్ టీం 10.2 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. దీంతో విండీస్ టీం పీకల్లోతు కష్టాల్లో కూరుకపోయింది. సూపర్-8లో తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 76 పరుగుల తేడాతో ఓడిపోవడం భారత్ ప్రచారానికి పెద్ద దెబ్బగా మారింది. దీనితో పాటు వెస్టిండీస్ జింబాబ్వేపై 107 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేయడంతో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీమిండియా నెట్ రన్ రేట్ పరంగా వెనుకబడింది. ప్రస్తుతం భారత్ సెమీఫైనల్ రేసులో నిలవాలంటే ఇతర మ్యాచ్‌ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు వెస్టిండీస్ జం దక్షిణాఫ్రికా మ్యాచ్ ఫలితం భారత్ అవకాశాలను ఎలా మార్చుతుందో చూద్దాం.

### దక్షిణాఫ్రికా వెస్టిండీస్‌ను ఓడిస్తే..

దక్షిణాఫ్రికా గెలిస్తే, భారత్‌కు ఇది అత్యంత అనుకూల పరిస్థితి. అప్పుడు భారత్ తన మిగిలిన రెండు సూపర్-8 మ్యాచ్‌లలో - జింబాబ్వే, వెస్టిండీస్‌పై - తప్పకుండా గెలవాలి. అలా చేస్తే భారత్ సెమీఫైనల్‌కు అర్హత సాధించే అవకాశాలు బలపడతాయి. వెస్టిండీస్ దక్షిణాఫ్రికాను ఓడిస్తే.. (మ్యాచ్ పరిస్థితి చూస్తుంటే, వెస్టిండీస్ గెలవడం కష్టమే) వెస్టిండీస్ దక్షిణాఫ్రికాపై గెలిచి సూపర్-8లో వరుసగా రెండు విజయాలు సాధిస్తే, భారత్ మార్గం మరింత క్లిష్టమవుతుంది. అప్పుడు భారత్ తన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో జింబాబ్వే, వెస్టిండీస్‌ను ఓడించినా, అలాగే దక్షిణాఫ్రికా జింబాబ్వేపై గెలిచినా - మూడు జట్లు (భారత్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా) నాలుగు పాయింట్లతో సమానంగా నిలుస్తాయి. ఈ పరిస్థితిలో సెమీఫైనల్‌కు అర్హత నెట్ రన్ రేట్ ఆధారంగా నిర్ణయించబడుతుంది. ప్రస్తుతం భారత్ నెట్ రన్ రేట్ -3.800గా ఉంది. దక్షిణాఫ్రికా (o3.800), వెస్టిండీస్ (o5.350)తో పోలిస్తే భారత్ చాలా వెనుకబడి ఉంది. ఈ అంతరాన్ని తగ్గించాలంటే భారత్ తన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో భారీ తేడాతో గెలవడమే కాకుండా, ఇతర మ్యాచ్‌ల ఫలితాలు కూడా తమకు అనుకూలంగా రావాలని ఆశించాల్సి ఉంటుంది.

### భారత్ సెమీఫైనల్ చేరుతుందా?


భారత్‌కు అవకాశాలు పూర్తిగా ముగియలేదు. కానీ ఇప్పుడు ప్రతి మ్యాచ్ ఫలితం కీలకం. ముఖ్యంగా వెస్టిండీస్ జం దక్షిణాఫ్రికా పోరు టీమిండియా సెమీఫైనల్ ప్రయాణానికి కీలక మలుపుగా మారనుంది. అహ్మదాబాద్‌లో జరుగుతోన్న ఈ మ్యాచ్ ఫలితాన్ని భారత్ అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

## చెపాక్ మైదానంలో మ్యాచ్ కోసం అమెరికా నుంచి కెమికల్..

# జింబాబ్వేతో భారత్ చావోరేవో పోరు

టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా నేడు చెన్నైలోని చెపాక్ స్టేడియంలో భారత్, జింబాబ్వే జట్ల మధ్య జరగనున్న మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే టీమిండియా ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాలి. అయితే ఈ పోరుకు కేవలం ప్రత్యర్థి జట్టు మాత్రమే కాదు, ప్రకృతి కూడా ఒక సవాలుగా నిలిచింది. అదే మంచు ప్రభావం. రాత్రి వేళల్లో చెన్నైలో కురిసే మంచు కారణంగా బౌలర్లు బంతిపై పట్టు కోల్పోయే అవకాశం ఉంది. దీనిని అడ్డుకోవడానికి స్టేడియం యాజమాన్యం ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. చెపాక్ స్టేడియంలో మంచు ప్రభావాన్ని తగ్గించడానికి అమెరికా నుంచి ప్రత్యేకంగా తెప్పించిన డ్యూ క్యూర్ అనే కెమికల్‌ను గ్రౌండ్‌లో స్ప్రే చేస్తున్నారు. భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ రాత్రి జరుగుతుంది కాబట్టి, రెండో ఇన్నింగ్స్ సమయంలో మైదానం మొత్తం తడిగా మారి బ్యాటర్లకు అనుకూలంగా మారుతుంది. దీనివల్ల టాస్ గెలిచిన జట్టుకు అనవసరమైన అడ్వాంటేజ్ లభించకూడదనే



ఉద్దేశంతో మంగళ, బుధవారాల్లోనే ఈ కెమికల్‌ను చల్లారు. నేడు (గురువారం) మధ్యాహ్నం కూడా మరోసారి దీనిని స్ప్రే చేయనున్నారు. సాధారణంగా చెన్నై పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. కానీ మంచు కురిస్తే బంతి జారిపోతూ బ్యాట్‌పైకి వేగంగా వస్తుంది. అప్పుడు స్పిన్నర్ల మాయాజాలం పారదు. వాతావరణ నివేదికల ప్రకారం మ్యాచ్ సమయంలో హ్యుమిడిటీ (తేమ) 80 నుంచి 90 శాతం వరకు ఉండే అవకాశం ఉంది. ఈ డ్యూ క్యూర్ కెమికల్ వాడటం వల్ల గడ్డిపై మంచు బిందువులు ఏర్పడకుండా నిరోధించవచ్చు. తద్వారా మ్యాచ్ ఆద్యంతం బౌలర్లకు, బ్యాటర్లకు సమాన అవకాశాలు ఉంటాయని క్యూరేటర్లు భావిస్తున్నారు. దక్షిణాఫ్రికాతో జరిగిన గత మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఓడిపోయిన భారత్‌కు, ఈ మ్యాచ్‌లో గెలుపు అనివార్యం. జింబాబ్వే కూడా వెస్టిండీస్ చేతిలో 107 పరుగుల భారీ ఓటమిని మూటగట్టుకుని కసితో ఉంది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమ్ ఇండియా, ఈ టెక్నాలజీ సాయంతో మంచును జయించి జింబాబ్వేపై ఘనవిజయం సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు. టాస్ గెలిచిన కెప్టెన్ ఇక్కడ ఛేజింగ్‌కే మొగ్గు చూపే అవకాశం ఉన్నప్పటికీ, కెమికల్ ప్రభావం ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com